ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

స్నేహ

మే 7, 2006

లోపలి పేజీల్లో...

వీధి నాటికలు

ఉద్యమ తరంగాలు

రెండక్షరాల విశ్వరూపం

'అమ్మ'

హ్యాపీ బర్త్‌డే

7.5.2006 నుండి 13.5.2006 వరకు



చిక్కవరపు స్రవంతి
2సం॥, మే-4
ధనలక్ష్మి - శ్రీహరి
ఉప్పులూరు-కృష్ణాజిల్లా

ఎస్.కె. షరీఫ్
5సం॥, ఏప్రిల్, 27
సబానా - యూసఫ్
బండలెమూరు-రంగారెడ్డి జిల్లా

టి. ప్రశాంత్
9 సం॥, మే-1
లక్ష్మి - మునెప్ప
మదనపల్లి-చిత్తూరు జిల్లా

జి. శైనీ
6సం॥, మే-9
గౌరీ మల్లీశ్వరి - అనీల్‌కుమార్
ఏలూరు

టి. లిఖిత
1సం॥, మే-8
జ్యోతిర్మయి - రవి
ఆల్వాల్-సికింద్రాబాద్

ఇ. సృజన
6 సం॥, మే-13
కవిత -సత్యనారాయణ
హైదరాబాద్

టి. ప్రశాంత్
9 సం॥, మే-3
పద్మిని- సాంబశివరావు
తురకపాలెం-కృష్ణా జిల్లా

అఖిల్
ఏప్రిల్ 29
జి. సరస్వతి - జి. సుధాకర్
గార్గేయపురం- కర్నూలు జిల్లా

గమనిక: పదేళ్ల వరకు వయసు గల చిన్నారులందిరికీ ఈ 'హ్యాపీ బర్త్‌డే' శీర్షిక కింద ఉచితంగా శుభాకాంక్షలు తెలియజేస్తాం. దీనికి మీరు చేయవలసిందల్లా మీ చిన్నారి పుట్టిన రోజుకు **20** రోజుల ముందుగా ఓ కలర్ ఫొటో జతచేసి పేరు, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లు, చిరునామా వంటి వివరాలు పంపడమే. **E- mail** ద్వారా కూడా ఫొటో, వివరాలు పంపవచ్చు. ప్రజాశక్తి శుభాకాంక్షలతో మీ చిన్నారి పుట్టిన రోజును ఆనందంగా జరుపుకోండి.

పంపవలసిన చిరునామా_హ్యాపీ బర్త్‌డే, స్నేహ, ఆదివారం అనుబంధం
1-1-298/4 స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్-20
E-mail:happybirthday_prajasakti@yahoo.com



విలువల కోసం పోరాడాలి

మార్పు అనివార్యం. కంసుడి కాలమైనా కంప్యూటర్ కాలమైనా రాజకీయ, సామాజిక, సాంఘిక మార్పులు స్పష్టంగా కనపడుతున్నాయి. వాటికి అనుగుణంగానే మానవ సంబంధాల మధ్య, ఉత్పత్తి సంబంధాల మధ్య విలువలు మారుతున్నాయి. మారుతున్న విలువలతో రాజీ పడటమా? విలువల్ని నిలదీస్తూ ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించడమా అన్నది ఇప్పుడున్న సమస్య.

సర్వకాల సార్వజనీనంగా మారని విలువలంటూ కొన్ని ఉంటాయి. వాటిని మనం గౌరవించి అనుసరించాలి. తర్వాతి తరాలకు అందించాలి. అవి కుటుంబ సంబంధాలు, మానవ సంబంధాలు, సాంస్కృతిక సంబంధాలు. ఇవాళ మనిషికి విలువ లేదు. ఆర్థిక విలువలే మానవ సంబంధాలకు శిలువలు వేస్తున్న కాలమిది. కత్తులు పట్టేవారే తప్ప కొవ్వొత్తులు పెట్టేవాళ్లు కనపడటం లేదు. ఇప్పుడు మంచి సమాజం కోసం, మంచి విలువల కోసం మనం పోరాడాలి.

ప్రస్తుతం ప్రపంచీకరణ మన జీవితాలను శాసిస్తోంది. కొందరైతే అసలు ప్రపంచీకరణ లేదంటున్నారు. ఆ నేపథ్యంలో ఈ కవిత రాశాను.

ప్రపంచీకరణ ఎక్కడుందో
చూపించమన్నాడు...
నా అమెరికా మిత్రుడు.
నిండు గోదావరి పక్కన
నీళ్ల పొట్లాలు అమ్ముకుంటున్న
పసిబాలుడ్ని చూపించాను.
కొబ్బరి బొండాలమ్ముకుంటూ...
కోకోకోల తాగుతున్న
కోనసీమ వ్యాపారిని చూపించాను.
ఇప్పుడు చెప్పండి
ఇంతకంటే
ఇంకేం చూపించమంటారూ???

ఎండ్లూరి సుధాకర్

మన అతిథి గురించి...

పేరు	:	ఎండ్లూరి సుధాకర్
పుట్టింది	:	21-1-1959, నిజామాబాద్, పాముల బస్తీ.
తల్లితండ్రులు	:	ఎండ్లూరి దేవయ్య, శాంతాబాయి
విద్య	:	వీధిబడి నుంచి విశ్వవిద్యాలయం దాకా.
వృత్తి	:	అసోసియేట్ ప్రొఫెసర్, త్రైమాసిక పత్రిక 'వాఙ్మయి' సంపాదకులు.
అలవాట్లు	:	పుస్తకపఠనం. రచనలు చేయడం.
నచ్చిన అంశం	:	అట్టడుగు వర్గాల గురించి ఆలోచించి అక్షరాలుగా మలచటం.
నచ్చని అంశం	:	సంపన్నుల సంఖ్య పెరుగుతూ సామాన్యులకు నాలుగు మెతుకులు అందకపోవడం.
పురస్కారాలు	:	25కు పైగా అవార్డులు.

ఈ సంచికలో...

టపా ... 2
టర్నింగ్‌పాయింట్ ... 4
సలహాలు ... 5
ఇంటి సంగతులు ... 6
క్యాంపస్ ఛాట్ ... 10
సినిమా కబుర్లు ... 11
బాలనేస్తాలు ... 12
అట్టమీది కథ ... 14
మనమూ మన నమ్మకాలు... 20

ఇంకా...

ఇలా వుందామా... 7
ప్రేమరాహిత్యం

సీరియల్ 8
తెలుగుగడ్డ

కథ 18
ఆశ

ఆరోగ్యం ... 17
విజ్ఞాన వీచిక ... 21
వీక్షణం ... 22
కొత్త పుస్తకాలు ... 24



ప్రమోదకరం

రవాణాదినోత్సవం సందర్భంగా ఇచ్చిన 'గిజిగాడి గూడు మన రవాణా వ్యవస్థ' కవర్‌స్టోరీ చాలా బాగుంది. ఇందులో రోడ్డు ప్రమాదాల జాబితా, వాహనాల వివరాలు, వాయు కాలుష్యం మొదలైన ఎన్నో వివరాలతో ఎంతో ఆసక్తికరంగా వుంది. రవాణా వ్యవస్థను మెరుగుపరచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై వుంది. అలాగే ప్రజలు కూడా ట్రాఫిక్‌రూల్స్‌ను పాటించాల్సిన అవసరం వుంది. ఈ రెండు జాగ్రత్తలూ తీసుకుంటే ప్రమాదాలు లేని ప్రమోదకరమైన ప్రయాణమౌతుంది.

కె. వాణీరంగారావు, హైదరాబాద్.



ప్రేమాయణాలు

పిచ్చిపిచ్చి ప్రేమకథలతో వెకిలి సినిమాలు వస్తోన్న నేపథ్యంలో అసలు ప్రేమంటే ఏమిటో ఎలా వుండాలో చక్కగా రాశారు. నిజంగా ఇవాల్టి యువతీయువకులు శారీరక ఆకర్షణే ప్రేమనుకుంటున్నారు. కాలేజీలు ఎగ్గొట్టి మరీ ప్రేమాయణాలు సాగిస్తున్నారు.

ఎన్. జనార్ధన్, కలవపూడి.

అభినందనలు

ప్రతివారం ఓ అపురూప అతిథిని పరిచయం చేయడం బాగుంది. ఈసారి డాక్టర్ వి.వై. కోటారెడ్డిగారు 'సంపాదనకన్నా సేవాతత్పరత మిన్న' అన్నారు. ఎక్కువమంది ఇలా ఆలోచించి ఆచరించకపోయినప్పటికీ ఇదెంతో అమూల్యమైన విషయం. ఇంత మంచి భావజాలాన్ని కలిగున్న కోటారెడ్డిగారికి మా అభినందనలు.

రామేశ్వరరావు, నందిగామ.

ధన్యవాదాలు

'తెలుగుగడ్డ' ఈ తరంవాళ్ళు తప్పక చదవాల్సిన నవల. వ్యాపార ధోరణిలో సస్పెన్స్ థ్రిల్లర్లకు చోటివ్వకుండా ఈ మంచి నవలను అందిస్తున్నందుకు మీకు ధన్యవాదాలు.

జి. కాంతారావు, చీరాల.

బాగుంటున్నాయి

స్నేహాలో ఇస్తోన్న జోక్స్ బాగుంటున్నాయి. ఎక్కడా వెకిలితనమూ, అతీ లేకుండా హుందాగా వుంటూ హాయిగా నవ్వుకునేలా వుంటున్నాయి.

ఎస్వీ కృష్ణారావు, అమలాపురం.

ఆలోచించండి

'మనసా తెలుసా' శీర్షికలో హిప్నో కమలాకర్ రాస్తోన్న అంశాలు ఆసక్తికరంగానే వున్నప్పటికీ దాదాపు అన్నీ ఒకేలా వుంటున్నాయి. ప్రతిసారీ 'పిల్లలకు డబ్బులెక్కువ ఇవ్వొద్దు, వాళ్ళు కోరినవన్నీ తీర్చొద్దు' అని చెప్తున్నారు. బాగానే వుంది కానీ ఎందరు పిల్లలు కాదన్నంతలో ఊరుకుంటారు? మారాంచేసి మొండికేసేవాళ్ళ సంగతేమిటి? నిజానికి అలాంటి పిల్లలతోనే కదా అసలు చిక్కు. కనుక మొండితనం ఎందుకు అలవడుతుంది, అలాంటి సమయాల్లో వాళ్ళని ఊరడించడం ఎలా, మంచిదారిలోకి తేవడం ఎలా - అనే అంశాలపై దృష్టిపెట్టి రాస్తే బాగుంటుందేమో కాస్త ఆలోచించండి.

టి. కిరణ్మయి, సికింద్రాబాద్.

అవగాహన

న్యాయవాది శ్రీనరసింహా రావు గారు ఇస్తోన్న సమాధానాలు అరటిపండు ఒలిచి చేతికిచ్చినంత స్పష్టంగా వుంటున్నాయి. ఇవి చదువుతోంటే లీగల్ అంశాలపట్ల అవగాహన కలుగుతోంది.

ఎస్. కిరణ్, మహబూబ్ నగర్.

తెగులు

అస్పృశ్యతపై పోరాటంచేసిన గాంధీజీ గురించి ఇవ్వడం బాగుంది. ఆ మహాత్ముడు పోరాటంచేసి ఎనభయ్యేళ్ళు దాటినా ఇప్పటికీ ఇంకా అంటరానితనం, కులాల పట్టింపు వుండనేవుంది. ఈ కులాలకుళ్ళు ఎప్పటికి తుడిచిపెట్టుకు పోతుందో కదా?! ఇది ఒకరకంగా తెగులనే చెప్పాలి.

మాదిరెడ్డి వెంకట్రావు, విజయనగరం.

హాస్యాస్పదం

'ముదురు బెండకాయ' బాగుంది. ఇందులో ఎక్కడా అతిశయోక్తి కనిపించలేదు. ఇవాళారేపూ ఎందరో యువకులు రాకేష్ మాదిరిగానే వున్నారు. వాళ్ళకి చదువులో సరస్వతి, అందంలో అప్సరస, డబ్బుకు కుబేరుడి కూతురు... ఇలా అన్నిట్లో అపూర్వంగా, అత్యద్భుతంగా వుండాలి. కానీ ఇంటిపని విషయంలో మాత్రం పనిమనిషికంటే హీనంగా అణగిమణగి వుండాలి. ఇదెంత అన్యాయమో, అమానుషమో, అసాధ్యమో కుర్రాళ్ళకి అర్థంకావడంలేదు. కనీసం వాళ్ళకి తెలీదులెమ్మని నచ్చచెప్పాల్సిందిపోయి పెద్దలూ యువకుల్ని ఆ రకంగా ప్రోత్సహించడం హాస్యాస్పదం.

మాధవపెద్ది కల్యాణి, వరంగల్.

ఆసక్తికరం

సీనియర్ నటుడు శ్రీ టి.ఎల్. కాంతారావుగారి అనుభవాలు, అనుభూతులు ఆసక్తికరంగా వున్నాయి. ఒక సందర్భంలో పల్లెటూరి వేషానికి పనికిరావని తిరస్కరించిన అలాంటి పాత్రల్లో సజీవంగా నటించడం జరిగింది. ఇదెంతో గమ్మత్తు. ఇవాళ గొంతు బాగాలేకపోతే ఇంకొకరితో డబ్బింగ్ చెప్పిస్తున్నారు. అలా ఇంకెన్నో జిమ్మిక్కులు చేస్తున్నారు. కానీ ఆనాడు అలా వుండేదికాదు. ఎంతో నైపుణ్యం వుంటేనే రాణించేవాళ్ళు.

వై. జగన్‌మోహన్, తిరుపతి.

రూ.510/-ల ఇంగ్లీష్ కోర్సు రూ.150/-కే



మొత్తం మూడు డివిజన్ల ప్రత్యేక ఇంగ్లీష్ కోర్స్

డివిజన్-1	డివిజన్-2	డివిజన్-3	
రూ.130/-	రూ.170/-	రూ.210/-	రూ.510/-

డివిజన్-1 ABCD ల నుంచి ఇంగ్లీష్ చదవటం, రాయటం, నేర్పుతూ, ప్రతి ఒక్కరికీ కావలసిన స్థాయిలో స్టాండర్డ్ ఇంగ్లీష్ నేర్పబడుతుంది. ఈ కోర్స్ ఫీజు రూ.130/-

డివిజన్-2 తప్పులు లేకుండా ఇంగ్లీషు రాయుటకు కావలసిన ఆంగ్ల వ్యాకరణం పరిపూర్ణంగా సులభ సూత్రాలతో చాలా ఈజీగా నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.170/-

డివిజన్-3 ఎంతో సులభంగా, ఏ సందర్భంలోనైనా తడబడకుండా, తప్పులు లేకుండా, మంచి నీళ్ళు తాగుతున్నట్లుగా మంచి ఇంగ్లీషు మాట్లాడటం నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.210/-

రూ.150/-కే

ఇవన్నీ!

కోర్స్ అద్భుతంగా ఉంది!

అవును! ఈ ఇంగ్లీష్ కోర్స్ చాలా అద్భుతంగావుంది. ఎందుకంటే, బాగా చదివినవారికే కాక, కొద్దిగా చదువుకున్న వారికి కూడా అర్ధమయ్యేరీతిలో చెప్పిన విధానం చాలా బాగుంది.

-కె.సురేష్, హైదరాబాద్.

ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా!...

నేను ఒకసారి రైలులో ప్రయాణిస్తున్నాను. నా ప్రక్క సీటులోని వ్యక్తి స్టూడెంట్స్ ఇంగ్లీష్ ఇన్‌స్టిట్యూట్ వారి పుస్తకాలు చదువుతున్నాడు. నేనూ టైంపాస్ కొరకు ఒక బుక్ తీసుకొని చదివాను. అంతే! నాకు ఆశ్చర్యంవేసింది. "ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా!..." అనిపించింది. నేనూ పుస్తకాలు తెప్పించుకుని చదివి ప్రస్తుతం నేను చక్కగా ఇంగ్లీష్‌లో మాట్లాడుతున్నాను.

- కె.కమలాకరరావు, విజయవాడ.

ఎక్కడా చూడలేదు

నేను డిగ్రీ వరకూ చదివాను. అయినా ఇంగ్లీష్ మాట్లాడలేక పోయేవాడిని. సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోండి అని ప్రకటన చూసి కోర్స్ కొన్నాను. నిజానికి నేను ఇలాంటి కోర్స్ బుక్స్ ఎక్కడా చూడలేదు.

- వై.చంద్రశేఖర్, విశాఖపట్నం.

ఇదొక డిఫరెంట్ కోర్స్!

డిగ్రీవరకు చదివిన నేను ఇంగ్లీష్‌లో మాట్లాడలేకపోయేవాడిని, నా మిత్రుని వద్ద ఈకోర్స్ బుక్స్ చూశాను. ఇంగ్లీష్ ఫ్లూయెన్సీకి కరక్ట్‌గా ఉపయోగపడే బుక్స్ యివి. 'ఇదొక డిఫరెంట్ కోర్స్' అని నాకు అనిపించింది.

- వి.కె. రాజు, రాజమండ్రి.

సులభంగా వుంది

చాలా పుస్తకాలు చూశాను. ఇంగ్లీష్ నేర్పే విధానం ఆ పుస్తకాల్లో అర్థమయ్యేది కాదు నాకు. ఈ కోర్స్ కొని చదువుతుంటే, ఇంగ్లీష్ ఇంత సులభమా అనిపించేంతగా వుంది. చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకొన్నాను.

- జె.శ్రీనివాసులు, తిరుపతి.

STUDENTS' ENGLISH INSTITUTE

POST BAG NO.8569, New No. 203, Habibullah Road, (Near: KodambakkamRly. Stn;) T.Nagar, Chennai - 17.

నాకు ప్రస్తుతం రూ.510/-లు విలువగలిగిన ఇంగ్లీష్ కోర్సు కేవలం రూ.150/-లకే వి.పి.పి. ద్వారా పంపించండి. పోస్ట్‌మేన్‌కి పైకం చెల్లించి ప్యాకెట్‌ని తీసుకుంటానని హామీ ఇస్తున్నాను.

3727

Name: ....

Address: ....

....

....

....

.... Pincode

టర్నింగ్ పాయింట్

వకుళాభరణం రామకృష్ణ

అమృతాంజనమిచ్చి ఆంధ్ర పత్రికనిచ్చి...



శిరోభారాన్ని తగ్గించే ఔషధాలు మార్కెట్లో ఎన్నున్నా కూడా నాటికీ, నేటికీ అమృతాంజనాన్ని మించిన లేపనం మరొకటి లేదన్నది అందరి అనుభవం. ఎన్ని దినపత్రికలు, మరెన్ని వార, పక్ష, మాస పత్రికలొచ్చి మార్కెట్‌ను నింపినా, అప్పటి ఆంధ్రపత్రిక, లేదా భారతి లాంటి సాహిత్య పత్రికలు రాలేదనీ, ఒక వేళ వచ్చినా, అప్పటి ఆ రెండు పత్రికలు ఆయా రంగాల్లో కావించిన కృషి మార్గదర్శకంగా పరిగణించడంలో రెండు అభిప్రాయాలుండవు.

అమృతాంజనం, ఆంధ్రపత్రిక – ఈ రెంటికీ అవినాభావ సంబంధం ఉండడం, విశ్వదాతగా పేర్గాంచిన కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు, వీటికి ఆద్యుడని చెప్పడం అతిశయోక్తి కాదు వాస్తవం. మనందరికీ సాధారణంగా అనారోగ్యం కల్గించే స్వల్ప రుగ్మతలు, జలుబు, దగ్గు తలనొప్పి వీటిని ఎంత త్వరగా నయం చేసుకుంటే అంతమంచిదని భావించటం మానవ నైజం. అలాంటి పరిస్థితుల్లో, ముందుగా అమృతాంజనాన్ని వైద్యరంగంలో ప్రవేశపెట్టిన ఘనత కాశీనాథులవారిది. ఇక జాతీయోద్యమకాలంలో ప్రాంతీయ భాషల్లో పత్రికారంగం మూడు పువ్వులు, ఆరు కాయలుగా విస్తరిస్తున్నప్పుడు, ఆ ప్రభావంలోంచి పుట్టుకొచ్చిందే ఆంధ్ర పత్రిక. ఆంధ్రుల జాతీయ భావదీప్తికి, వ్యాప్తికి చేదోడువాదోడుగా నిల్చిన అప్పటి ఏకైక వార్తాపత్రిక కూడా ఆంధ్ర పత్రికే!

ఇంతకీ వీటి కథాకమామిషు ఏమిటంటా? వీటిని ప్రసాదించిన ఆ మహాపురుషుని పూర్వాపరాలేమిటి? ఆంధ్ర దేశంలో సంస్కరణోద్యమం మంచి ఊపులో ఉన్నప్పుడు, జాతీయోద్యమం మొగ్గ తొడుగుతున్నదశలో 1867 ఏప్రిల్ 11న కృష్ణా జిల్లా ఎలమర్రులో శ్యామలాంబ, బుచ్చయ్యలకు నాగేశ్వరరావు జన్మించాడు. మచిలీపట్నంలో చదువు ముగించుకుని, ఉన్నత విద్యకు మద్రాసు చేరాడు. ఉద్యోగానికి ప్రయత్నించక సొంతంగా వ్యాపారం పెట్టి, స్వేచ్ఛగా దేశసేవ చేయాలని సంకల్పించుకున్నాడు. తుదకు బొంబాయి చేరి, 'విలియం అండ్ కో' అనే బ్రిటీష్ కంపెనీలో చిన్న ఉద్యోగంలో చేరాడు. దాని యజమాని ఇంగ్లండుకు వెళ్తూ కంపెనీ బాధ్యతలను నాగేశ్వరరావు చేతిలో పెట్టాడు. ఇది ఆయన జీవితంలో తొలి మలుపు. కంపెనీ వ్యాపారం వృద్ధి చెందింది. ధనార్జన మొదలైంది. ఆయుర్వేదంలో ఆసక్తి ఉన్న పంతులు గారు, తానే కొన్ని మందులు తయారుచేసేవాడు. ఈ క్రమంలో అమృతాంజనాన్ని కనుగొన్నాడు. ఇది ఆయన జీవితంలో రెండో మలుపు. తృటికాలంలో అమృతాంజనానికి దేశమంతటా మంచి పేరొచ్చింది. కాశీనాథుని నాగేశ్వరరావుకు సరుకును ఎలా అమ్మాలో కొనుగోలుదార్లను ఎలా ఆకర్షించాలో బాగా తెలుసు. అమృతాంజనం గూర్చి పత్రికల్లో ప్రకటనలు గుప్పించాడు. ఆ రోజుల్లోనే రంగురంగుల ఆకర్షణీయమైన అడ్వర్టైజ్‌మెంట్స్ ఇచ్చాడు. దీంతో విపరీతంగా లాభాలు గడించాడు.

ఈ నేపథ్యంలో 1908లో ఆంధ్ర పత్రికను ప్రారంభించాడు. గిట్టనివారు కొందరు తన అమృతాంజనాన్ని అమ్మడానికి పత్రికను ప్రారంభించాడని విమర్శించారు. అయినా అది వాస్తవం కాదు. ప్రజల్లో రాజకీయ చైతన్యాన్ని పెంచి, ఆ సమయంలో ముమ్మరంగా సాగుతున్న స్వదేశీ ఉద్యమం ఊపందుకోడానికి ఆంధ్రపత్రిక దోహదం చేసింది. ఆంధ్ర పత్రిక స్థాపన తెలుగు జర్నలిజంలో ఒక పెద్ద ఘటన. కేవలం రాజకీయాలకే గాక, తెలుగు భాషకు, సారస్వతానికి ఈ పత్రిక ఎనలేని సేవలందించింది. పంతులుగారు బొంబాయి నుంచి వ్యాపార లావాదేవీలను మద్రాసుకు మార్చాడు. 1914లో ఆంధ్రపత్రికను దిన పత్రిక చేశాడు. ఇది తెలుగువారి మొదటి దినపత్రిక. అంతేకాక, 1924లో 'భారతి' అనే సాహిత్య మాసపత్రికను స్థాపించాడు. భారతీయభాషల్లో ఇంత గొప్ప సాహిత్య పత్రిక వెలువడలేదని అభిజ్ఞుల అభిప్రాయం. ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచికలు (ఉగాది సంచికలు) సాహిత్య, సామాజిక, రాజకీయ, ఆర్థిక విషయాలకు పేరెన్నికగన్నాయి. ఇప్పటికీ, అవి పరిశోధకులకు విశేషంగా ఉపయోగపడ్తూనే ఉన్నాయి.

'అమృతాంజనమిచ్చి', 'ఆంధ్రపత్రిక', 'భారతి' లందించిన కాశీనాథులవారు గొప్ప సాహిత్యవేత్త కూడా. 'ఆంధ్రగ్రంథమాల' అనే సంస్థను స్థాపించి ఆంధ్ర విజ్ఞాన సర్వస్వాన్ని వెలువరించారు. స్వయంగా 'ఆంధ్ర వాఙ్మయ చరిత్రము', 'భగవద్గీతపై వ్యాఖ్యానం' మొదలైన ఎన్నో ప్రామాణిక గ్రంథాలను రచించారు. 1919లో ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసుకు అధ్యక్షునిగా ఎన్నికయ్యాడు. తన ఏకైక కూతిరికి బాల్యవివాహం చేయలేదు. పరిణత వయసులో (అప్పట్లో) పెళ్ళిచేయడం ఆయన ఉన్నతభావాలను చెప్పకనే చెప్తాయి. ఆంధ్రదేశంలో గ్రంథాలయాలకు ఉచితంగా ఆంధ్రపత్రికతోపాటు ఎన్నో ఇతర గ్రంథాలను విరాళంగా పంపేవాడు. సత్యాగ్రహకాలంలో కారాగారవాస శిక్షను అనుభవించిన విశ్వదాత నాగేశ్వరరావు పంతులు 1938లో మరణించాడు. ✷

కోర్టు వాయిదాలకు తిరుగుతున్నాం.

నా వివాహం 1997లో ఇల్లందులో అత్తగారింట్లో జరిగింది. కొత్తగూడెంలో రెండు సంవత్సరాలు కాపురం ఉన్నాం. ఉన్నన్ని రోజులూ నా భార్య అసహనంగానే ప్రవర్తించింది. ఎప్పుడూ ఇంట్లో తగాదాలు సృష్టించేది. ప్రశాంతం అన్నది మా ఇంట్లో లేదు. ఆ తరువాత ఖమ్మంలో కాపురం పెట్టాక ఒక సంవత్సరం ఉన్నది. తరువాత చెప్పకుండానే వాళ్ళ అమ్మావాళ్ల ఇంటికి వెళ్ళింది. ఎన్నిసార్లు ప్రయత్నించినా ఇంటికి రాలేదు. దాంతో నేను విడాకులు కోరాను. కోర్టుకు హాజరు కాలేదు. పైగా నాపై, మా అక్కపై తనని రాచి రంపాన పెట్టామని ఇల్లందు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. కోర్టు వాయిదాలకు తిరుగుతున్నాం. మాకు ఏం చేయాలో అర్థం కావడం లేదు.

రమణ, హైదరాబాద్

మహిళకు వివాహానంతరం భర్తగారి వద్ద ఎదురయ్యే హింసను అరికట్టడం కోసం కట్నం వేధింపులు లాంటివి జరిగితే రక్షణ కోసం 498ఎ, ఐపిసి క్రింద భర్త గాని వారి తరపు బంధువులు కాని శిక్షార్హులు. కొంత మంది భార్యలని హింసించి ఉండవచ్చు. కాని హింసించకపోయినా, మహిళకు భర్త, వారి బంధువుల మీద కోపం వచ్చి తను కాపురానికి రావడానికి ఇష్ట పడనట్లయితే వారు ఈ చట్టం ప్రకారం కేసు పెడుతున్నారు. అప్పడప్పడు ఇది దుర్వినియోగం అవుతుందని న్యాయస్థానాలు (న్యాయమూర్తులు) కూడా అంగీకరిస్తున్నారు.

మీ విషయంలో మీరు కాపురం చేసింది, హింసించింది, ఇల్లందు పోలీసు స్టేషన్ పరిధిలోకి రానందున (ఖమ్మం, పరిధిలో జరిగి ఉంటుంది) అభియోగాలు మోపి విచారించే హక్కు ఇల్లందు పోలీసులకు లేదని మీరు హైకోర్టులో పిటిషన్ వేసుకోవచ్చు. నేరం ఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిందో అక్కడి పోలీసులు విచారించే వీలు కలిగి ఉంటారు. పక్కన ఉన్న పోలీస్ స్టేషన్ పరిధిలోకి రాదని వాదించవచ్చు.

ఎంత ఖర్చవుతుంది?

నా మిత్రుడు తన అవసరాలకు నా వద్ద 2002లో 25,000 తీసుకున్నాడు. ప్రోనోటు కూడా ఉన్నది. ఆ డబ్బు గురించి ఎప్పుడడిగినా రేపు మాపు అని దబాయిస్తున్నాడు. డబ్బు విషయమై కోర్టుకు వెళ్లవలసి వస్తే ఎంత ఖర్చవుతుంది?

మురళీ, ఖమ్మం.

జి.ఎల్.నరసింహారావు
హైకోర్టు న్యాయవాది

మీరు 2002లో ఇచ్చానన్నారు. ఆ ప్రోనోటు బాపతు మళ్ళీ ఏమైనా చెల్లింపులు జరిగినాయా? లేదంటే మూడు సంవత్సరాలు దాటితే ప్రోనోటుకు విలువ ఉండదు. కావున 25 వేలు ప్రోనోటు వెనుక జమ చేయించండి. లేదంటే మీరు కోర్టుకెళ్లినా ఫలితముండదు. కోర్టుకు వెళ్ళవలసి వస్తే ఫీజు, కోర్టు ఖర్చులు కలిపి 4000/- వరకు కావచ్చు.





ఇంటి సంగతులు

అసలు సంగతి

ఇంద్రగంటి జానకీబాల



మా పక్కింటివాళ్లూ మేమూ స్నేహంగా ఉంటాం. మూడు రోజులక్రితం వాళ్ళింట్లో కొత్త పనిమనిషి చేరింది. దాంతో ఇక ఆ ఇంటి ఇల్లాలి ఆనందం చెప్పనలవి కాకుండా ఉంది. ఆ కొత్త పిల్ల ఏ పనైనా ఒక్కసారి చెప్తే చాలట. తూ.చ. తప్పకుండా శుభ్రంగా చేసేస్తుందట.

"ఇలా చేసేవాళ్ళు ఇంతవరకూ కుదరలేదు. ఈ పిల్ల దొరకడం నిజంగా నా అదృష్టమే" అంటూ ఓ పదిసార్లయినా నాతో అన్నది పక్కింటి కమలమ్మ.

ఇంటిపని చేయడంలో అలసిపోయిన ఆడవాళ్లు బాధ్యతగా పనిచేసే పనివారిని చూసి మురిసిపోతారు. కమలమ్మ అన్నట్లు మంచి పనిమనుషుల్నే గొప్ప అదృష్టంగా భావించక తప్పదేమో అనిపించింది.

ఆరోజు తెల్లవారి లేచేసరికి పక్కింటావిడ వచ్చి "ఈ పనిపిల్ల బాగా చేస్తోందని మురిసిపోయానా.. ప్చ్.. అది కాస్తా మూణ్ణాళ్ళ ముచ్చటగా మిగిలింది. మా పిల్ల ముత్యాలగొలుసు పొద్దుట్నుంచీ కనిపించటం లేదు. వెతికీవెతికీ వేసారిపోయాం అనుకో" అంటూ తేల్చింది.

"అంటే పనమ్మాయి తీసిందనా నీ ఉద్దేశం? ఆ అమ్మాయి అయ్యుండదు... సరిగా చూడండి.. నాలుగుమూలలా వెతకండి" అన్నాను.

"చూశాం గానీ లాభం లేకపోయింది.. ఈ పనిమనుషులకి ఏది కనిపిస్తే అది మాయం చేసే గుణముంటుంది. అదే బాధ" అంది.

"ఏం, ఎందుకలా అనిపించింది?" అన్నాను.

"ఆ.. డబ్బులేనివాళ్ళు... ఏం కొనుక్కోవాలన్నా చేతిలో పైసలుండవు. అందుకే కక్కుర్తిబుద్ధితో కనిపించిందల్లా కాజేస్తుంటారు" అంది కమలమ్మ ఛీత్కారంగా.

"చాల్లేండి, డబ్బు లేనంత మాత్రాన అందరూ దొంగతనం చేస్తారా? ఆ మాటకొస్తే డబ్బున్నా దొంగబుద్ధి గలవాళ్ళుంటారు. వాళ్ళు హుందాగా కనిపిస్తూనే కనిపించిందల్లా మాయం చేస్తారు" అన్నాను.

"ఆ.. మీరు మరీనూ.. డబ్బున్నవాళ్ళకేం ఖర్మ దొంగతనం చెయ్యడానికి" అనేసి ఆమె వెళ్ళిపోయింది.

ఇంటెడు చాకిరీ చేయించుకుంటున్నప్పటికీ పనిమనుషులమీద నమ్మకం ఉండదు. కారణం వాళ్ళు పూట గడవడం కోసం అంట్లు తోమడం, ఇల్లు తుడవడం, బట్టలుతకడం వంటి అడ్డమైన పనులూ చేయడమే. వాళ్ళు దొంగతనం సులువుగా చేస్తారని చాలామంది మధ్యతరగతి మనుషుల నమ్మకం. ఈ వక్ర ఆలోచనలో మార్పురావాలి. పనిచేసేవాళ్ళ శ్రమ విలువ తెలుసుకుని ఆలోచించాలి. పేదరికంలో ఉన్నవాళ్ళు కూడా ఎంతో నిజాయితీగా ఉంటారు. అయితే కొన్నిసార్లు వాళ్ళ ఆర్థికస్థితి వారిని దిగజార్చే పరిస్థితీ ఏర్పడుతుంది. కొందరు పరిస్థితుల ప్రభావంవల్ల తప్పనిసరై ఇంటిపనులకు కుదురుతారు. అప్పుడు వాళ్ళ పనిలో శ్రద్ధ కనిపించదు. కొందరు స్వభావరీత్యా పనుల్ని బాధ్యతగా, చేస్తారు. అందరినీ ఒకేరాటకు కట్టకూడదు.

మొత్తానికి దొంగతనం చేసిందన్న ఆరోపణతో చక్కగా పని చేస్తోందని మురిసిపోయిన అమ్మాయిని మాన్పించివేశారు. కమలమ్మ నెత్తిమీద మళ్ళీ పనంతా పడింది. ఒకరకంగా కమలమ్మకి చేతులు విరగ్గొట్టినట్లైంది.

ఇంతాచేస్తే అదేమంత ఖరీదైన ముత్యాలహారం కానేకాదని ఆవిడే చెప్పారు. 'అయితే మాత్రం దొంగబుద్ధి మంచిది కాదు. ఈరోజు ఇదైంది, రేపు మరొకటవుతుంది' అని అందరూ కలిసితేల్చారు.

వారం తిరిగేసరికి అసలు నిజం బయట పడింది. కమలమ్మ కూతురి స్నేహితురాలు ముత్యాలదండ పర్సులో వేసుకుని, ఫ్రెండును ఏడిపిద్దామనుకుందట. తీరా విషయం విషమించి, పనిపిల్లని తీసేశారని తెలిసి ఆమె బాధపడ్తూ అసలు సంగతి చెప్పిందట.

ఇంటిల్లిపాదీ పశ్చాత్తాపడ్డారు. 'ఆ అమాయకురాలిని అనవసరంగా అనుమానించానే' అని కమలమ్మ నిజంగా గిలగిలలాడిపోయింది. కానీ తమ తప్పుని ఒప్పుకునేందుకు అందరికీ అహంకారం అడ్డువచ్చింది. ఏవో కుంటిసాకులు చెప్పుకోవడం మొదలు పెట్టారు.

"పనివాళ్ళకి నువ్విచ్చే జీతం కన్నా, వాళ్ళ మీద నువ్వు ప్రకటించే నమ్మకమే ఎక్కువ ఆనందాన్నిస్తుంది. నిన్ను వాళ్ళు ప్రేమించేలా చేస్తుంది" అన్నాను ఒళ్ళుమండి.

కమలమ్మ మౌనంగా వుండిపోయింది. ✷

ఇలా వుందామా...

ప్రేమరాహిత్యం

వి నాగరత్న

ఒక ముఖ్యమైన పనిమీద ఊరెళ్ళాల్సి వచ్చింది. ఎటూ ఆ ఊళ్ళోనే వుంటారు కనుక చిన్నమ్మమ్మని చూసిరమ్మంది అమ్మ.

అసలే ఎండలు మండుతున్నాయి. అందునా మిట్టమధ్యాహ్నం కావడాన ఇక మంటలమధ్య నిలబడ్డట్లే వుంది. ఆటో ఎక్కితే వేడిగాలులు. వెళ్ళి చాలా సంవత్సరాలు కావడాన ఊరంతా మారిపోయింది. ఎక్కడ చూసినా ఆకాశహర్మ్యాలే. 'ఫ్లాట్ల కల్చర్ ఇక్కడికీ పాకిందన్నమాట' అనుకున్నాను. మొత్తానికి అరగంట ప్రయాణం తర్వాత చిన్నమ్మమ్మ ఇల్లు చేరాను. తీరా చూస్తే గేట్ లాక్‌చేసి వుంది.

ఆ తాళంకప్పను చూడగానే చచ్చేంత నీరసమొచ్చింది. 'ఈ ఎండనపడి ఎందుకొచ్చానా' అని గాఢంగా నిట్టూరుస్తూ ఎదురుగా చూద్దును కదా ఇంటి కిటికీలోంచి చిన్నమ్మమ్మ కనిపించింది.

"అరే నువ్వు ఇంట్లోనే వున్నావా? మరి గేటు తాళమేసి వుందేంటి అమ్మమ్మా?" అన్నాను పెద్దగా.

అమ్మమ్మ తలుపు తీసుకుని గేటుదగ్గరికి వచ్చింది. నన్ను చూస్తూనే కన్నీళ్ళు పెట్టుకుంది. గేటు గ్రిల్ డిజైన్లోంచి చేతులు బయటకు చాపి నా బుగ్గలు నిమురుతూ "ఏమ్మా, బాగున్నావా? ఎన్నాళ్ళకే నిన్ను చూట్టం?" అంది.

"బాగున్నాను అమ్మమ్మా. నువ్వే నీరసించిపోయావు. అవునూ.. మావయ్య, అత్తయ్య ఎక్కడికి వెళ్ళారు?"

"గుడికెళ్ళినట్లున్నారు"

"కీ తీసుకురా, తాళం తీస్తే లోనికొస్తాను" అన్నాను.

"తాళంచెవి నాకిచ్చే మాటుంటే అసలు తాళమెందుకేస్తారమ్మా?"

నాకంతా అయోమయంగా వుంది. అమ్మమ్మని లోపలుంచి తాళమేయడమెందుకు? ఆవిడేమైనా మతిస్థిమితం లేని మనిషా, వాళ్ళొచ్చేలోపు ఎక్కడికైనా వెళ్ళిపోతుందనుకోడానికి?!

"కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుందంటారు. నా కోడలు నన్ను నమ్మదమ్మా... వాళ్ళొచ్చేలోపు ఏమైనా వస్తువులు అమ్ముకుంటానని భయమట"

ఆ మాట విని అవాక్కయిపోయాను.

ఏ నిమిషాన కొడుకు, కోడలు వస్తారోనని భయపడ్తూ, బెదురుచూపులు చూస్తూ అమ్మమ్మ కొన్ని సంగతులు చెప్పుకొచ్చింది. ఆ ఇంట్లో ఆవిడకి ఓ పనిమనిషికున్న విలువ కూడా లేదని తెలిసి గుండె మెలిపెట్టినట్లయింది.

"కాళ్ళు చూడమ్మా ఎలా పగిలాయో" అంటూ అరికాళ్ళు కొద్దిగా పైకెత్తి చూపింది. పాదాలు నెరియలిచ్చినట్లయి రక్తం కనిపిస్తోంది.

"అయ్యో అమ్మమ్మా, కాస్త వేజిలిన్ రాయకపోయావా?" అన్నాను.

"వాజిలిన్‌దాకా పోయావ్... రెండుచుక్కలు కొబ్బరినూనె రాశానోలేదో, సీసా లాగేసుకుని "కాళ్ళకక్కూడా కొబ్బరినూనె పట్టించి మర్దనాలు చేసుకోడానికి వదవహారేళ్ళ పడుచుపిల్లననుకుంటున్నావా?" అని ఛీత్కరించి నానా మాటలూ అంది" అంటూ కళ్ళు తుడుచుకుంది.

"ఛఛ, అదేం మనిషి? కనీసం మావయ్యైనా కలగజేసుకోడా?"

"వాడు సరైనవాడైతే దానికెందుకు కొమ్ములొస్తాయమ్మా? ఇంతకీ నా ప్రారబ్ధం బాగాలేదు. పలకరించే దిక్కులేక అల్లాడిపోతున్నానమ్మా. ఈ ఇల్లు దగ్గరుండి నేను కట్టించాను. మీ తాతయ్య సంపాదించిందాంట్లో ఎంతో పొదుపుగా వాడి పైసాపైసా దాచి, ఎన్ని కష్టాలు పడితే ఈ ఇల్లు ఏర్పడిందో నాకే తెలుసు. అలాంటిది ఇవాళ ఈ ఇంట్లో నాకు స్థానం లేకుండా చేసింది. అదేమంటే 'మా ఆయనొక్కడే వున్నాడా? ఇంకో కూతుర్ని కన్నావుగా, అక్కడికి ఫో' అంటుంది. కూతురిల్లు నాదౌతుందా? నువ్వు చెప్పు.. మీ అమ్మ నీ దగ్గరుంటుందా?" అంటూ జాలిగా అడుగుతోంటే నా గుండె తరుక్కుపోయింది.

"ఏమౌతుంది అమ్మమ్మా, ఆవిడగారు అంత హీనంగా చూస్తోంటే... పోనీ పెద్దమ్మదగ్గరికే వెళ్ళకపోయావా?" అన్నాను.

ఇంతలో కొడుకూకోడలూ దూరంగా కనిపించినట్లున్నారు... పులిని చూసిన లేడిపిల్లలా బెదురుబెదురుగా లోనికెళ్ళిపోయింది అమ్మమ్మ.

కాసేపటికి "ఏమ్మా, ఎంతసేపైంది?" అని మావయ్యగొంతు వినిపించాక సాధ్యమైనంత ప్రసన్నంగా ముఖంపెట్టుకుని వెనక్కి తిరిగి "ఇప్పుడే మావయ్యా.. లోపల అమ్మమ్మ కనిపించడంతో ఆగిపోయాను" అన్నాను.

"ఆ..ఆ.. పడుకుంటుందేమో, ఆమెనెందుకు లేపడమని తాళమేశాం" అంటోన్న ఆవిడతో మాట కలపడం ఇష్టంలేక మౌనంగా వుండిపోయాను. అమ్మమ్మ ఎక్కడ నొచ్చుకుంటుందోనని తినకుండానే వచ్చాను కానీ వాళ్ళిద్దరి నైజం అర్థమయ్యాక ఇక ఆ ఇంట్లో నీళ్ళు కూడా తాగాలనిపించలేదు. భోంచేయమంటే తినొచ్చానని అబద్ధం చెప్పాను. వాళ్ళిద్దరూ భోంచేశారు.

నన్ను నేను కంట్రోల్ చేసుకోలేక "మరి అమ్మమ్మ తినదా?" అన్నాను.

"మేం ముందు తింటే తప్ప ఆవిడ తినదు" అంది ఆ కోడలు.

చివరికి అమ్మమ్మకి ఓ చొట్టలుపోయిన పళ్ళెంలో అన్నం, కూర పెట్టి "మోకాళ్ళ నొప్పులు.. టేబుల్‌మీద తినలేదు" అంది కోడలు నన్ను ఉద్దేశించి. 'పనిమనిషికి టేబుల్‌మీద వడ్డించలేను' అని అఘోరించరాదూ? నీ దృష్టిలో ఆవిడ అంతకంటే దిగజారిపోయిందికదా' అనుకున్నాను.

అమ్మమ్మ తాను పడ్తోన్న కష్టాల్లో ఒక్కశాతం మాత్రమే చెప్పింది. ఇంత నరకయాతన అసలా చిన్నిగుండె ఎలా భరిస్తోందబ్బా అనుకుని తల్లడిల్లిపోయాను. ఏది లేకపోయినా నడిచిపోతుందిగానీ ప్రేమరాహిత్యాన్ని ఎలా తట్టుకోగలరు? మనచుట్టూ ఇలాంటి అమ్మమ్మలు, నాయనమ్మలు, తాతయ్యలు ఎందరున్నారో?!

అంటే వృద్ధాప్యం రాగానే ఓల్డ్ ఏజ్ హోంలో చేరాలా? లేదంటే చచ్చిపోవాలా? రెండూ చేతకాకపోతే ప్రేమరాహిత్యంతో జీవచ్ఛవాల్లా బ్రతుకును ఈడ్వాలా? అంతేతప్ప మనవాళ్ళని మనం ప్రేమగా చూసుకోలేమా?

✷

సీరియల్

గొల్లపూడి నారాయణరావు

(యాదవరెడ్డి పోట్లగిత్త పటేలు గిత్తతో కుమ్ములాటకు దిగుతుంది. యాదవరెడ్డి ఎంత విడతీద్దామని ప్రయత్నించినా వీలుకాదు. చివరికి యాదవరెడ్డి గిత్త ధాటికి పటేలు గిత్త పారిపోతుంది.

మధ్యలో అడ్డొచ్చిన గుర్రాన్ని కూడా పేగులు బయటికొచ్చేలా పొడుస్తుంది యాదవరెడ్డి పోట్లగిత్త)

16వ భాగం

ఆ మాటలకు అందరూ పకపకా నవ్వారు. అందరిలోకీ ఏసురత్నం మరీ అధికంగా నవ్వాడు.

గజ్జెలరెడ్డి మండిపడ్డాడు. ఏసురత్నం వైపుకు చురచుర చూస్తూ "ఏసూ ఎందుకు మిడిసిపడ్తావు? నీ పని చెప్తానాగు" అన్నాడు. కాని అతడి మాటనెవరూ పట్టించుకోలేదు. ఎడ్లవెంట అందరూ గ్రామంలోకి ప్రవేశించారు. పంచాయతీ చెట్టు వద్దకు వచ్చేసరికి అక్కడ గ్రామపెద్దలందరూ కూర్చుని ఉండడం కనిపించింది. వారిలో కోదండరాంరెడ్డిని ఉద్దేశించి

"ఏమిటి మావయ్యా? అర్ధరాత్రివేళ అందరూ తీరికగా ఇక్కడ కూర్చున్నారు?" అనడిగాడు యాదవరెడ్డి.

"తోకచుక్క పొడిచిందోయి. దానికోసం ఏం చేద్దాం? ఏమిటి? అని కూర్చుని మాట్లాడుకుంటున్నాం" అన్నాడు కోదండరామిరెడ్డి.

"తోకచుక్క పొడిచిందా, ఎక్కడా?" అని అటూఇటూ దిక్కులు చూశాడు యాదవరెడ్డి. అతడితోబాటు మిగతా ఎడ్ల కాపలా యువకులందరూ ఆకాశంవైపుకు ఆతృతగా చూశారు.

"ఊరిబయటి నుండి వస్తున్నారు గదా, మీరింతవరకూ తోకచుక్కనే చూడలేదా? అదిగో తూరుపుదిక్కున తోకచుక్క" అన్నాడు కోదండరామిరెడ్డి.

అందరూ ఆవైపుకు చూశారు. దుక్కి మోకంత తోకతో ఒక చుక్క కనిపించింది.

"ఇలాంటి చుక్కలు ఎప్పుడూ పొడవలేదుగదా మావయ్యా" అన్నాడు యాదవరెడ్డి.

"అవును, ఇది దేశానికి అరిష్టం" అన్నాడు కోదండరామిరెడ్డి.

పోట్లగిత్త

"అరిష్టమైనా ఇప్పుడు మనం చేసేదేముంది? రేపు పొద్దున్నే శాస్త్రిగారి దగ్గరికెళ్లి దీనికి ఉపశాంతి ఏమిటో అడిగి తెలుసుకుందాం" అన్నాడు పెద్దిరెడ్డి.

"సరే లేవండి ఇళ్లకు వెళదాం" అన్నాడు కోదండరామిరెడ్డి. ఆయన మాటలతో కూర్చున్నవారందరూ లేచి ఇళ్లకు బయల్దేరారు. వారితోపాటు యాదవరెడ్డి వగైరాలందరూ ఎవరి ఇళ్ళకు వారు వెళ్లిపోయారు.

☆☆☆☆

మరునాడు ఉదయం తెలతెలవారుతుండగా కోదండరామి రెడ్డి చెంబుపట్టుకుని బయలు ప్రదేశానికెళ్లాడు. ఇద్దరు పాలేళ్లు రోటివద్ద జొన్నలు దంచుతున్నారు. ఇద్దరు పాచిపని చేస్తున్నారు. రంగనాయకమ్మ ఇంట్లో ఎక్కడో ఉంది. అఖిలాండం ఇంటిముందు కళ్లాపి చల్లుతోంది. ప్రతాప్‌రెడ్డి ఇంకా నిద్రనుండి లేవనేలేదు.

పటేలు అయోధ్యరాంరెడ్డి మూరెడు పొడవున్న కర్రను చేతిలో పట్టుకుని ఊగిసలాడించుకుంటూ అంగలేస్తూ లోపలికొచ్చాడు. జొన్నలు దంచుతున్న పాలేళ్లవైపుకు ఉరిమిచూస్తూ "ఏసుగాడెక్కడున్నాడురా?" అని గద్దించి అడిగాడు.

"ఎడ్ల కొష్టంలో పేడకళ్లు తీస్తున్నాడయ్యగారూ" అని చెప్పాడు జొన్నలు దంచుతున్న గోపాలం.

పటేలు తలూపుతూ ఇంకో నాలుగంగలేసి ఎడ్ల కొష్టంలోకెళ్లాడు. తలొంచుకుని పేడకళ్లు తీస్తున్న ఏసును సమీపించాడు.

"ఏమిరా మాదిగలంజాకొడ్కా? కళ్లు నెత్తికెక్కినయిరా?" అంటూ చేతిలోని తుంటకర్రనెత్తి ఏసురత్నం వీపుమీద బాదనారంభించాడు. అతడు లబోదిబోమని మొత్తుకుంటున్నాడు. జొన్నలు దంచుతున్న పాలేళ్లు, అఖిలాండం, అందరూ ప్రతిమల మాదిరి నిలబడి చూస్తున్నారు.

ఏసురత్నం మొర విని చుట్టుపక్కలవారంతా పోగయ్యారు. ఎడ్ల కొష్టంముందు జనం కిటకిటలాడుతున్నారు. బయలు భూమికెళ్లిన కోదండరామిరెడ్డి అప్పుడే అక్కడికొచ్చాడు.

"ఏమిటీ రభసంతా?" అనడిగాడాయన అక్కడే నిలబడిఉన్న పటేలువైపుకు చూస్తూ.

"చూడవయ్యా చిన్నాపెద్దా లేకుండా ఈ లంజాకొడుకు ఏసుగాడు..." అన్నాడు పటేలు రొప్పుతూ.

"ఏసు మిమ్మల్నేమన్నాడేమిటి?"

"మావాణ్ని పట్టుకుని కాళ్లకిందుగా దూరిపొమ్మన్నాడట"

కోదండరాంరెడ్డి ఏసువైపుకు చూసి "ఏమిరా? అలాంటి మాటలెందుకన్నావురా?" అనడిగాడు.

ఏసురత్నం కళ్లవెంట బొటబొటా నీళ్ళు కారాయి. ఉమ్మడి బీటిలో రాత్రి కుర్రకారు, వాళ్లందరిమధ్య జరిగిన పందేలు, బలిగుడును గురించి పొల్లుపోకుండా చెప్పాడు చివరికి –

"ఇందులో నా తప్పేంటి? మీరే చెప్పండయ్యగారూ" అన్నాడు.

కోదండరాంరెడ్డి తలూపి "అదా విషయం" అన్నాడు.

ఏసురత్నం చొక్కా విప్పి తన వీపును అందరికీ తిప్పి చూపించాడు. పటేలు కొట్టిన దెబ్బలకు అతడి వీపుపై దద్దులెన్నో కనిపించాయి. కానీ అక్కడే ఉన్న పటేలును చూసి ఎవరూ ఏమీ అనలేకపోయారు.

యాదవరెడ్డి మాత్రం కలిగించుకున్నాడు.

"అన్యాయంగా మనిషిని పట్టుకుని కొట్టడమేమిటీ?" అన్నాడు పటేలువైపుకు చూస్తూ.

పటేలు వారగా యాదవరెడ్డి వైపు చూశాడు. "నీ న్యాయమేమిటో తెలుస్తుందిలే ఆగు" అన్నాడు.

"ఏమిటీ తెలిసేది?" వెటకారంగా అన్నాడు యాదవరెడ్డి.

"ఏమిటా? నీ గిత్త బడేమియా గుర్రాన్ని చంపలేదూ?" అని తల ఊగించాడు పటేలు.

"నా గిత్త నోరులేని పశువు, మరి నువ్వు?"

''ఒళ్లు తెలుసుకొని మాటలు జాగ్రత్తగా రానీ?''

"అది తెలుసుకుని జాగ్రత్తగా మాట్లాడవలసింది నువ్వే"

మధ్యన కోదండరామిరెడ్డి కలిగించుకుని "యాదవా వాగ్వాదం ఎందుకూ?" అన్నాడు.

"న్యాయం, అన్యాయం లేకుండా మనిషిని పట్టుకుని గొడ్డును బాదినట్లు బాదడం ఏమిటి మామయ్యా?''

''ఇప్పుడు న్యాయమేమిటోయ్? ఏదో జరిగిపోయింది. జరిగినదానికోసం ఇప్పుడెంత గింజుకున్నా లాభంలేదు'' అన్నాడు కోదండరామిరెడ్డి. తర్వాత పటేలువైపుకు చూస్తూ "ఇక నువ్వు ఇంటికెళ్లవయ్యా" అన్నాడు.

పటేలు తలూపాడు. చేతిలోని తుంటకర్రను దూరంగా విసిరిపారేశాడు. వారగా ఏసురత్నంవైపు చూస్తూ "లంజాకొడ్కా తిత్తితీసి డోలు వాయించేవాణ్ని బతికిపోయావు పో" అంటూ అక్కడినుండి బయల్దేరాడు.

"ఎందుకు తిత్తి తీయడం? నేనేమీ తప్పు చేయలేదు" అన్నాడు ఏసురత్నం బిర్రుగా. చుట్టూ ఉన్న వారందరినీ చూసి అతడిలో ధైర్యం పుంజుకుంది.

వెళ్లిపోతున్న పటేలు గిర్రున వెనక్కు తిరిగి "నీలుగుతున్నావేమిట్రా ఇంకా?" అన్నాడు.

"తిత్తి తీస్తానంటావెందుకూ?" అనడిగాడు ఏసురత్నం.

"తిత్తి తీయడమేగాదు, నిన్ను నరికి కండలుచేసి కాకులకు, గద్దలకు పారవేయిస్తా, అప్పుడు నీ బాబుగాడెవడడ్డం వస్తాడో చూస్తాను"

"నీ బాబు సొమ్మేమీ తినడం లేదు. ఊరికే నరికి పారేయడానికి" అన్నాడు ఏసురత్నం.

పటేలు అగ్గయిపోయాడు. అంతమందిలోను తన బాబును తలవడం విని సహించలేకపోయాడు. పళ్ళు పటపట కొరుకుతూ రెండు చేతులు పిడికిళ్ళు పట్టుకుని ఏసురత్నం మీదికి పోయాడు.

అంతలోనే కోదండరామిరెడ్డి ఆవేశంతో "పటేలూ, అక్కడే ఆగు" అనరిచాడు.

ఆ అరుపులకు పటేలు బ్రేకు పడినట్లుగా ఆగిపోయాడు. అప్పుడే నిద్రనుంచి లేచివచ్చిన ప్రతాపరెడ్డికి నిద్రమత్తు పూర్తిగా వదిలిపోయింది.

"ఇప్పటికే వాణ్ణి అన్యాయంగా కొట్టావు" అంటూ కోదండరామిరెడ్డి పటేలువైపుకు తీక్షణంగా చూశాడు.

"పెద్దమనిషివి నువ్వు అట్టానే మాట్లాడుతావేమిటీ?" అన్నాడు పటేలు కొంచెం తగ్గుస్థాయిలో.

"చాల్లే, ఇక బయటికి నడు"

"అసలునేనెవరో తెలుసా?"

"నీవెవరయిందీ తెలుసుకోలేని మూర్ఖుణ్ణి కాదు. ముందు బయటికి నడూ"

"మిడిసిపడుతున్నావుజాగ్రత్త"

"మర్యాదగా బయటికి నడుస్తావా? గెంటించమంటావా?"

ఆ మాటలకు పటేలు తుళ్లిపడ్డాడు. వారగా చూస్తూ తలూపుతూ అక్కణ్ణించి చరచరా వెళ్లిపోయాడు.

కోదండరామిరెడ్డికి అంతగా కోపం రావడం అదే ప్రథమం. ఆయన కోపోద్రేకం చూసి అక్కడివారంతా ఆశ్చర్యపడ్డారు. అందరికన్నా దూరంగా ఇంటిమెట్లపై నిలబడిచూస్తున్న ప్రతాపరెడ్డి మరీ ఆశ్చర్యంలో మునిగిపోయాడు!

☆☆☆☆

ఉదయం పదిగంటల సమయం. పటేలు అయోధ్యరాంరెడ్డి పనిగట్టుకుని పట్వారి ఇంటికొచ్చాడు. ఇంటిముందు సావిడిలో కూర్చుని పత్రిక తయారుచేసుకుంటున్న పట్వారి, పటేలు లోపలికి రావడం చూసి –

"రావయ్యా పటేలూ ఇటుకూర్చో" అంటూ బల్ల చూపించాడు. పటేలు వచ్చి ఆ బల్లపై కూర్చున్నాడు.

"ఏమిటీ పనిమీద వచ్చినట్టున్నావే?" అనడిగాడు పట్వారి.

"మీతో మాట్లాడాలనే వచ్చాను" అన్నాడు పటేలు.

"అట్లాగా?" అన్నాడు పట్వారి. ఆయన తన ముందున్న పుస్తకాలన్నింటినీ తీసి దస్త్రంలోవేసి బంధించాడు. పెన్నుతీసి జేబులో పెట్టుకున్నాడు. పటేలువైపుకు చూస్తూ "ఏవయ్యా పటేలూ! నువ్వూ, కోదండరాంరెడ్డి ఘర్షణపడ్డారట నిజమేనా?" అనడిగాడు.

పటేలు పై పెదవిని పళ్లమధ్యన వేసి నొక్కుతూ తలూపాడు. "మన గ్రామంవాళ్లు హద్దూ ఆపూ లేకుండా మరీ పెచ్చుమీరిపోతున్నారు" అన్నాడు.

"నిజమే లోగడ మనమంటే ఉన్న భయభక్తులన్నీ పోయాయ్. ఇతర గ్రామాలతో పోల్చి చూసుకుంటే మన గ్రామమే నయమనిపిస్తోంది"

"అలా మాట్లాడతారేంటీ? ఏమిటో ఆ నయం?"

(ఇంకా వుంది)

క్యాంపస్ ఛాట్

జి. రాజకుమారి

ఉత్తేజం



రామచిలుకల్లాంటి అమ్మాయిలతో కాలేజ్ క్యాంపస్ కళకళలాడుతోంది. ఒక చెట్టుకింద వున్న గుంపులోంచి బయటపడి సుమ హడావుడిగా నడవటం మొదలుపెట్టింది.

"ఏయ్, సుమా... ఇప్పటివరకూ బాగానే వున్నావ్ కదే... ఒక్కసారిగా అలా పరుగు పెడ్తున్నావెందుకే... చెప్పవే..." అనడుగుతూనే తానూ నడక వేగాన్ని పెంచింది రేవతి.

"అబ్బా.. రావే తల్లీ... ఇప్పుడు శారదా మేడమ్ క్లాస్.. సడన్‌గా గుర్తొచ్చింది.. రా... రా... టైమయింది.." ముందుకు నడుస్తూనే బదులిచ్చింది సుమ.

అప్పటికే అంతా క్లాస్‌కు వచ్చేశారు.. "ఎక్స్‌క్యూజ్‌మీ మేడమ్!" ఇద్దరూ క్లాస్‌రూమ్ తలుపు దగ్గర నిలబడ్డారు.

"ఆ.. రండర్రా... క్లాస్ మొదలుపెడదాం" మేడమ్ చిరునవ్వుతో వారిద్దరినీ అనుమతించారు. చిరు చెమటను చున్నీతో తుడుచుకుని నోట్ బుక్స్ తెరిచారు రేవతి, సుమా..

ఈరోజు మన సబ్జెక్ట్ 'పర్సనాలిటీ డెవలప్‌మెంట్... కమాన్ నోట్ డౌన్..' అంటూ శారదా మేడమ్ బ్లాక్ బోర్డు మీద రాసేందుకు అటువైపు తిరిగారు. ఆమె పొడవాటి వాలుజడలో గంధంరంగు గులాబీ తానూ క్లాస్ వినడానికి సిద్ధమే అన్నట్లు కొద్దిగా కిందికి జారింది.

"మనం పెరిగిన వాతావరణం మనలో ఉన్నత భావాలకు విత్తులు నాటుతుంది.. ఈ విషయం తెలుసా?.. మన ఇంట్లో పెద్దవాళ్ళు ప్రేమాభిమానాలను అందిస్తూ ప్రోత్సహిస్తే పిల్లలు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకుంటారు. ఇందులో ఏమాత్రం అతిశయోక్తి లేదు..."

"అవునా..?" అని స్టూడెంట్స్ ఎవరికివారు తమలో తాము తమ ఇంటి పరిసరాల్నీ, కుటుంబ పరిస్థితుల్నీ మననం చేసుకోసాగారు.

"నెక్స్ట్ 'రోల్ మోడల్'.. అంటే... మన ఇంట్లోవారూ, అమ్మానాన్నా... ఇలా ఎవరో ఒకర్ని ఆదర్శంగా తీసుకోవడం అనేది మన చిన్నతనంలోనే మొదలవుతుంది.. పెద్దవాళ్ళు ఎవరో ఒకర్ని రోల్ మోడల్‌గా తీసుకుని ఆ ప్రకారం నడుచుకుంటారనేది అతిశయోక్తి కాదు.. మీరు రేపు జాబ్ చేస్తున్నప్పుడు మీకన్నా ఎక్కువ హోదాలో వున్న వ్యక్తుల్ని, మీకు నచ్చినవారిని ఆదర్శంగా తీసుకోవడం పరిపాటి.."అంటూ చెప్పి ఆగారు మేడమ్.

క్షణం అందరివంకా చూసి "అర్థమౌతోందా..." అనడిగారావిడ.

"మేడమ్! ఇంటరెస్టింగ్‌గా వుంది.. చెప్పండి.. అయితే, రేపు పరీక్షల్లో ఎంత పర్సెంటేజ్ వస్తుందనేదే టెన్షన్‌గా వుందండీ... దానిని ఎలా బీట్ చేయడం?" అడిగిందో స్టూడెంట్..

అంతా ఫక్కున నవ్వేశారు.. మేడమ్ కూడా వారితో శృతి కలిపారు. తర్వాత "చూడమ్మా.. మంచి పర్సెంటేజ్ రావడానికి చదువుమీద మనసు లగ్నం చేయడమే మార్గం. చక్కటి ప్రణాళిక కూడా వుంటే, ఎటువంటి గందరగోళం వుండదు.. తెలిసిందా? ఒకవేళ పొరపాటున నీ అంచనాకు పర్సెంటేజ్ తగ్గిందనుకో.. అంత మాత్రాన నువ్వు పరాజితవు కాదు.. ఆత్మవిశ్వాసం ముఖ్యం.. అర్థమైందా..?! ఎనీ మోర్ డౌట్స్...?"

"మనం అనుకున్నవి అనుకున్నట్లు జరగకపోతే మనసుకు చాలా బాధగా వుంటుంది కదండీ.. అప్పుడెలా?" స్టూడెంట్స్ మధ్యలోంచి ఓ ప్రశ్న దూసుకొచ్చింది.

"వెరీ సింపుల్.. సవాళ్లను ఎదుర్కోడానికి సంసిద్ధంగా వుండాలి. మనసును స్థిమితపరచుకోవాలి.. అప్పుడు రిస్క్ తీసుకునే లక్షణం ఆటోమేటిక్‌గా అలవాటవుతుంది... నెమ్మదిగా తమంతట తాము ప్రేరణ పొందుతారు. ఇతరులపట్ల కూడా ఆదరణ చూపడం... వారి సమస్యలను ఆలకించడం.. వాటిక్కూడా పరిష్కారాలు ఆలోచించగల్గటం..." శారదగారు అలా అరటిపండు వలిచి నోట్లోపెట్టినట్లు క్లాస్ చెబుతున్నారు.

"...ప్రతికూల వాతావరణంలో ఉంటూనే అసాధ్యాలను సుసాధ్యం చేసుకున్న వ్యక్తుల జీవితగాథల్ని తెలుసుకోండి. తమ ప్రగతికి అవరోధాలుగా నిలిచిన బండరాళ్లనే నిచ్చెనమెట్లుగా ఉపయోగించుకుని విజయశిఖరాలను అధిరోహించినవారి జీవిత సత్యాలనుండి స్ఫూర్తిని పొందాలి. వాళ్లంతా అపజయాల్ని జయించినవారే. చెవిటివాడైన బెతోవిన్ వీనుల విందైన సంగీతాన్ని అందించారు. యాక్సిడెంట్‌లో కాలు పోగొట్టుకున్నప్పటికీ సుధాచంద్రన్ (మయూరి) నాట్యంలో అద్భుతమైన ప్రతిభ కనబరిచింది. ఆమె మనసులోని దృఢమైన సంకల్పమే ఆమెను ఉన్నత శిఖరంమీద నిలిపింది. ఇలా ఎంతోమంది ఉన్నారు. సమస్యలు వచ్చినప్పుడు కుంగిపోకుండా వాటిని అధిగమించడానికి ప్రయత్నించాలి" అంటూ ఆవిడ క్లాస్ ముగించేసరికి విద్యార్థుల్లో ఒకరకమైన ఉత్తేజం కలిగింది.

✷



సినిమా కబుర్లు

సీనియర్ నటుడు
శ్రీ.టి.ఎల్. కాంతారావు
చెప్తోన్న కబుర్లు...

చందు

అదేమన్నా మన తాతగారి జాగీరా?

కాలం మారకపోతే ప్రపంచం ఒక లెవెల్లో సాగదు. ఎండాకాలం తర్వాత వర్షాకాలం.. అనంతరం చలికాలం... ఇలా రుతువులు మారకుండా గనుక ఉన్నట్లయితే ఎలా? పూర్తిగా చలికాలం ఉంటే గడ్డకట్టుకుపోతాం. పూర్తిగా ఎండాకాలం ఉంటే తాగడానికి నీళ్ళుండవు. పూర్తిగా వర్షాకాలం ఉంటే ఏ పనులూ జరగవు. కనుక కాలం మారాలి.

అలాగే చిత్రసీమలో కూడా కొత్తవాళ్ళు రావాలి. అభిరుచిని బట్టి మార్పు వస్తుంది. మార్పు వచ్చినప్పుడే కాలం ముందుకు సాగుతుంది. ఇవాళ వండిన కూరే రోజూ తినాలంటే ఎలా? అభిరుచులు కూడా మారిపోతుంటాయి. ఇవాళ పులుసుతో తింటే రేపు ముక్కల పులుసు, ఎల్లుండి మజ్జిగ పులుసు వండమంటున్నాం. మన జిహ్వ ఎలాగైతే కొత్తను కోరుకుంటుందో కళ విషయంలో కూడా కొత్త తరాన్ని కోరుకోవాలి. అలా కోరుకోకపోయినా కాలం దానంతట అది మారుతూనే ఉంటుంది. కాలం మారకూడదనుకోవడం స్వార్థం. కాలమేమన్నా మన తాతగారి జాగీరా? 'మారిపోవురా కాలము / మారుట దానికి సహజమురా...' అని ఆత్రేయగారు ఒక వాక్యంలో చెప్పారు.

జనాభా పెరుగుదలే అన్ని అనర్థాలకూ మూలం

ప్రజల్లో స్వార్థచింతన బాగా పెరిగిపోయింది. దీనికి మూలకారణం జనాభా పెరుగుదల అని నా కచ్చితమైన అభిప్రాయం. జనాభా పెరుగుదల కారణంగా పరిస్థితులు మారాయి. దీంతో దుష్టాలోచనలు, దుర్మార్గపు నడతలు పెరిగిపోయాయి. కాలం మారినా, పరిస్థితులు మారినా, ధరలు పెరిగినా, ఏం జరిగినా జనాభా పెరుగుదలే కారణం. అన్ని అనర్థాలకు మూలం జనాభా పెరుగుదలే. ఏ ఉత్పత్తులైనా అందుకోసమే వస్తున్నాయి. జనాభాతోపాటు వాహన వాడకం పెరిగింది. దీంతో రోడ్లు చాలకుండా పోయాయి. రోడ్లను ఎంతని వెడల్పు చేసుకుంటూపోగలం?! జనాభా పెరుగుదలతో అవసరాలు పెరిగిపోయాయి. వ్యవసాయ భూమిలో ఇళ్ళు కట్టుకోవాల్సి వస్తోంది. పదిమంది ఉండాల్సిన స్థలంలో అంతస్తులు పెంచుకుంటూ పోయి వెయ్యిమంది నివశిస్తున్నాం. నేనిప్పటికీ నటిస్తున్నానంటే అది చాలా గొప్ప విషయం. అక్కినేని నాగేశ్వరరావుగారిని మినహాయిస్తే నా సమకాలీకులలో వేషాలు వేస్తున్నవారు లేరు.

మా పాఠాలు వేరు... వాళ్ళ పాఠాలు వేరు

కొత్తవాళ్ళు మనం చెబితే నేర్చుకునే స్థితిలో లేరు. మనకు చెప్పే స్థితిలో ఉన్నారు. వాళ్ళ పాఠాలు వేరు... మన పాఠాలు వేరు... మావి తెలుగు పాఠాలు... వాళ్ళవి ఇంగ్లీషు పాఠాలు. మేము ఇంగ్లీషు పాఠాలు కూడా నేర్చుకోగలుగుతున్నాం కానీ వాళ్ళు పుట్టినప్పటి నుంచి ఇంగ్లీషు పాఠాల్లో ఉంటూ తెలుగు పాఠాలు మర్చిపోయారు. ఇంగ్లీషుకే పరిమితమవుతున్నారు.

కైలాస సంగీతం

వైకుంఠంలో ఉన్న విష్ణుమూర్తి సంగీత ప్రియుడు. వీణానాదంతో కమ్మని సంగీతాన్ని వింటుంటాడు. కైలాసంలో శివుడికి ఢ...ఢ...ఢ... అని శబ్దం చేసే డమరుకం తప్ప వాయిద్యాలేమీ నచ్చవు. ఒకప్పుడు మన సంగీతం వైకుంఠంలో ఉండేది. ప్రస్తుతం కైలాసంలో ఉంది. ప్రస్తుతం మన సంగీతం 20 డప్పులు, 20 మద్దెలలు, 20 తబలాలతో సరి. ఎంతసేపూ కొట్టడమే పని. ఎందుకంటే రిథమ్‌తో కాళ్ళు ఆడుతూ ఉండాలంటారు. దీనికి తగ్గట్టు శివాలెత్తినట్లు డాన్స్ చేస్తున్నారు. దాన్ని నృత్యం అందామా? ఎక్సర్‌సైజ్ అందామా? సర్కస్ అందామా? ఏమనాలో నాకర్థం కావడంలేదు. పుట్టిన బిడ్డ హాయిగా పడుకోవాలనుకుంటే అలనాటి సంగీతం అవసరం. కానీ పురిటి బిడ్డ ఎక్కడికో పోవాలనుకుంటే ఈనాటి సంగీతం కావాలి.

అంతా ఇన్‌స్టెంటే

ప్రస్తుతం ఏదైనా ఇన్‌స్టెంటే. వడలు తినాలంటే ఇన్‌స్టెంట్ పిండిని నీళ్ళలో కలుపుని వండుకోవడమేనట. అలాగే యాక్టింగ్ కూడా. మమ్మల్ని నటించొద్దంటున్నారు. 'మీరలా నుంచుంటే చాలు. మా కెమేరానే కిందికీ మీదకీ తిప్పుతుంది' అంటున్నారు. 'నేను తింటాను. నా చేయి పట్టుకో నీ కడుపు నిండుతుంది' అనే రోజులు కూడా వస్తాయేమో.. భవిష్యత్తులో పుట్టబోయే వాళ్ళకి ఒక చేయి మాత్రమే ఉంటుంది. మరో చేయి చెవి దగ్గర అతుక్కుని పుడతారు. అలా ఎందుకయ్యా అంటే అక్కడే అవసరం మరి, సెల్ ఫోన్ పట్టుకునేందుకు తేలిగ్గా వుంటుంది.

పరుగో...పరుగు...

మా రోజుల్లో పది సినిమాలు విడుదలైతే ఎనిమిది సినిమాలు విజయాన్ని చవిచూసేవి. సినిమా సెట్స్ పైకి రావాలంటే ఆరు నెలలపాటు దర్శకుడు, రచయిత, కెమేరామేన్ కూర్చొని పెరుగు నుంచి వెన్న తీసినట్టుగా కథను మథించి దానికి ఒక అద్భుతమైన రూపాన్నిచ్చేవారు. 'మాయాబజార్', 'లవకుశ' వంటి అలనాటి చిత్రాలు ఇప్పటికీ చిరస్థాయిగా నిలిచాయంటే అదే అసలు రహస్యం. వాళ్ళు సినిమాను ఏ కాలానికైనా పనికొచ్చేలా తీసేవారు. ఇప్పుడంతా పరుగో...పరుగు... ఇవాళ సూర్యుడు అస్తమించిన తర్వాత కూడా ఔట్ డోర్ షూటింగ్ తీస్తున్నారు. అంతా ఫాస్ట్... ఫాస్ట్... ✶

బాలనేస్తాలు



ఇ.సుకన్య,
7వ తరగతి, జగ్గంపల్లి.

చిన్నారి చిత్రకారులు



పిల్లి రాంబాబు, 7వ తరగతి,
బిసి బోయిస్ హాస్టల్,
జగ్గంపేట, తూ.గో.

జి.స్వామి, 8వ తరగతి,
బిసి బోయిస్ హాస్టల్, జగ్గంపేట, తూ.గో.

చుక్కలున్నచోట రంగులేసేద్దాం

హేయ్ బుజ్జాయిలూ... కింద గీతల్లో ఎవరో దాక్కున్నారు. బయటకు రమ్మంటే ఎంతకీ రావడంలేదు. మీరేంచేస్తారంటే... చుక్కవున్న గడుల్లో మీకు నచ్చిన రంగులు అద్ది చూడండి. అప్పుడు దాక్కున్నవాళ్లు ఎవరో ఇట్టే తెలిసిపోతుంది. రెడీనా!



కవల పీతలు ఏవి?





చుక్కలు కలిపితే....

పిల్లలూ...పై బొమ్మలో ఓ బుజ్జిది ఆడుకుంటోందికదూ. ఇంతకీ ఆ పాప ఎక్కడ, ఏ చెట్టు కింద ఆడుతోందో తెలియాలంటే... అర్జంటుగా చుక్కలు కలిపెయ్యండి. ఇంకా అలాగే చూస్తున్నారేంటి! పెన్నో, పెన్సిలో బయటకు తియ్యండీ.

ఏవి ఎన్ని వున్నాయో!

చిన్నారులూ...కింద క్రిస్మస్ చెట్టు ఒకటి వుందికదా. అందులో రకరకాల ఆకారాలు చాలా వున్నాయి. అయితే ఏ ఆకారాలు ఎన్ని వున్నాయో లెక్కించి చెప్పే అవకాశం మీకు ఇస్తున్నాం. మరి సరిగ్గా లెక్కపెట్టి కింద వున్న ఆకారాలకు ఎదురుగా అంకె వెయ్యండే.

1 = 2 = 3 = 4 = 5 =
6 =



ఏ ముక్క ఎక్కడ సరిపోతుంది?

ఓ ఫొటో ఫ్రేమ్ పగిలిపోయింది. దాని ముక్కలు ఫ్రేమ్ బయట వున్నాయి. ఇంతకీ ఏ ముక్క ఎక్కడ సరిపోతుందో మీరే కనుక్కుని చెప్పాలి.

గిటార్ చేద్దాం



నేస్తాలూ! ఇకనుంచి మనం ప్రతివారం ఓ బొమ్మను తయారు చేయడం నేర్చుకోబోతున్నాం. సంతోషమేనా! ఈ వారం మనం గిటార్ ఎలా చేయాలో చెప్పకుందాం.

ఏమేం కావాలంటే... పాలపౌడర్ పాకెట్టు (సిరప్ సీసాలకు వచ్చే పాకెట్టయినా పరవాలేదు), పెన్సిళ్లు చెక్కుకునే చాకు, గమ్ టేపు, నాలుగు పెద్ద రబ్బర్‌బ్యాండ్లు.

ఎలా చేయాలంటే... ముందు పాకెట్టు లోపల శుభ్రంగా వుందో లేదో చూడాలి. తర్వాత పై మూత పెట్టేసి టేప్ వెయ్యాలి. చాకు తీసుకుని పాకెట్టుకు ఒక వైపున దీర్ఘచతురస్రాకారంలో కత్తిరించి తీసెయ్యాలి (2వ బొమ్మ). తర్వాత నాలుగు రబ్బరుబ్యాండ్లను పాకెట్టుకు తొడగాలి. అంతే గిటార్ రెడీ. ఇప్పుడు ఈ పాపాయిలా మీరు కూడా చేతివేళ్లతో రబ్బరు బ్యాండ్లను కదిలిస్తూ శబ్దాలు చేయవచ్చు. మరి ఆలస్యమెందుకంట!

అట్టమీది కథ

సి. సుజాత

అమ్మకంటే తీయనైంది, కమ్మనైంది ఇంకోటి లేనేలేదు. ప్రపంచంలో అత్యంత నిస్వార్థమైన, కల్మషరహితమైన ఆత్మీయ సంబంధం వుందంటే అది తల్లీపిల్లలదే. నవమాసాలు మోసి, కనడంతో తల్లి బాధ్యత తీరిపోదు. వాళ్ళని పెంచి పోషించి, ప్రయోజకులుగా తీర్చిదిద్దడం వరకూ ఎంతో సహనం చూపుతుంది. ఎన్నో త్యాగాలు చేస్తుంది. ఎన్నిట్నో కోల్పోతుంది. కానీ అన్నీ ఇష్టంగానే చేస్తుంది. ఆ ప్రేమస్పర్శలో ఎన్ని ఒడిదుడుకులనైనా ఇట్టే మర్చిపోతుంది. మనకి జన్మనిచ్చి, ఆలనాపాలనా చూసి, మనకంటూ ఓ ఉనికిని తెచ్చిపెట్టిన అమ్మకి ఏమిచ్చీ ఆవిడ రుణం తీర్చుకోలేం. తల్లుల దినోత్సవం మన సంస్కృతి కాదు. రోజూ ముఖం చూపించడానిక్కూడా వీలుకానివాళ్ళు ఒక 'దినం' పెట్టారు - అని తోసిపుచ్చాల్సిన అవసరం వుందా? వీలైతే మనకి తోచినవిధంగా అమ్మని రోజూ సంతోషపరుద్దాం. ఈ ప్రత్యేకరోజున అమ్మకి ఇంకోసారి అభినందనలు తెలియజేస్తే వచ్చే నష్టమేమైనా వుందా? మే 9 అంతర్జాతీయ తల్లుల దినోత్సవం సందర్భంగా 'అమ్మ'మీద ప్రత్యేక కథనం...

రెండక్షరాల విశ్వరూపం 'అమ్మ'

అమ్మ గురించి ఇవ్వాళ కనిపెట్టగలిగేది, కొత్తగా పరిచయం చేసేది ఏదీలేదు. పేపర్లలో త్రీడీ ఎఫెక్ట్ వున్న బొమ్మల్ని చూస్తూవుంటాం. గజిబిజిగా పొదలుంటాయి. చిక్కగా పువ్వుల వరసలు కనిపిస్తూవుంటాయి. ఆ పొదల్ని, పువ్వుల్ని ఓ మాదిరి దూరంనుంచి కళ్ళతో దీక్షగా చూడగలిగితే, అందులోంచి అక్షరాలు కనిపిస్తాయి. పువ్వుల వరసలన్నీ నవ్వే ముఖాలైపోతాయి. ఇదెలా వుంటుందంటే... అమ్మాయిల్లోంచి, ఆడవాళ్ళలోంచి అమ్మను కనిపెట్టినట్లు.

ఆడవాళ్ళలోంచి అమ్మను ప్రత్యేకంగా విడదీసి చూడటం కష్టమే. దేశకాలమాన పరిస్థితులతో సంబంధం లేకుండా ఎక్కడైనా, ఎప్పుడైనా ఆడవాళ్ళని 'జీవితంలో మీరు మరువలేని క్షణం ఏదైనా వుందా?' అని అడిగిచూడండి. అమ్మయిన ఏ స్త్రీ అయినా 'తాను తల్లినైన క్షణం' అని చెప్తుంది. అందులో రవ్వంతైనా అబద్ధం వుండదు. పాపాయి ఒడిలోకి వచ్చిన క్షణంకంటే తల్లయిన మనిషికి అద్భుతం ఇంకేముంటుంది?

తొమ్మిది నెలలుగా తన కడుపులో రూపం పోసుకుని ప్రసవవేదన భరించాక, కళ్ళు తెరిచిన పువ్వులాగ తన చేతుల్లోకి వచ్చిచేరిన పసిగుడ్డు అమ్మ కడుపులో ఖాయంగా ఓ కొత్త ప్రపంచపు ద్వారాలు తెరుచుకుని బయటికొస్తుంది.

తనకోసంగా అమ్మ మనసులో ఓ ప్రత్యేకమైన మందిరం... ఆ బిడ్డచుట్టూ అమ్మ అల్లుకున్న ఆశల పట్టుదారాలు... ఆ బిడ్డకోసం తల్లికడుపులో పొంగులెత్తే ప్రేమామృతపు అలలపైన బిడ్డ జీవితం హాయిగా ప్రారంభమౌతుంది. తల్లి తనకు తానుగా తీసుకున్న పెంపకపు బాధ్యత బిడ్డచుట్టూ ఎవ్వరూ కట్టని సురక్షితమైన వాత్సల్యపుగోడ.

అతి పేదరికంలో లేదా అత్యున్నత స్థితిలో వుండొచ్చు... ఏ వ్యక్తినైనా సరే 'నీ కిష్టమైనదేమిటి?' అనడిగితే క్షణం ఆలోచించకుండా 'అమ్మ' అనో 'బాల్య'మనో చెప్పేస్తారు. నిజంగా అలాంటి మర్చిపోలేని అనుభూతిని ప్రసాదించే దేవత మాత్రం నూటికి నూరుపాళ్ళూ అమ్మే.

మరి అంత అమూల్యమైన మాతృత్వాన్ని పంచే కన్నతల్లికి మాత్రం వెంటనే అనుభవంలోకి వచ్చేది తనపైన ఈ బిడ్డ బాధ్యత వుందన్న వాస్తవం. ఈ కఠోరసత్యాన్ని మించింది నిస్వార్థంగా పొంగుకొచ్చే మాతృప్రేమ. అదే లేకపోతే ఇన్ని అసమానతలు, ఇన్ని లొసుగులు వున్న ఈ కుటుంబవ్యవస్థ ఇంతకాలం పదిలంగా రూపం మార్చుకోకుండా వుండేదేకాదు. తల్లికి స్పష్టంగా తెలుసు... తన

ఒడిలోకి వచ్చిన పసికందుకోసం, తన ప్రేమనంతా కేంద్రీకరించిన ఈ బిడ్డకోసం ఓ మంచి వాతావరణం కల్పించాలి. ఆ బిడ్డకు కన్న తండ్రి ప్రేమ కావాలి. ఆ తండ్రి సంపాదన కావాలి. ఆ కుటుంబానికి సంబంధించిన ఆస్తికంతా ఆ బిడ్డ వారసుడు కావాలి. బిడ్డ సుఖంగా పెరిగి సంపూర్ణ వ్యక్తిగా రూపుదిద్దుకోవాలి. ఇది అమ్మ లక్ష్యం. జీవితంలో లక్ష్యమంటూ లేకపోతే ఏదైనా అస్తవ్యస్తమే.

అమ్మ లక్ష్యం బిడ్డ పెంపకం. ఆ లక్ష్యం కచ్చితంగా ఆమెను ఓ పళ్ళున్న చక్రంలోకి నెట్టేస్తుంది. ఆ కఠోరమైన లక్ష్యం కోసం

అమ్మ ఇంటి చాకిరీకే పరిమితం ఐపోతుంది. ఇరవైనాలు గ్గంటలూ ఇంటికి కాపలా కాస్తుంది. ఇన్ని మాటలెందుకు ఒక్కముక్కలో చెప్పాలంటే మొత్తం ఇల్లంతా అమ్మే. నిస్సందేహంగా, నిర్భయంగా బిడ్డ బాధ్యత తీసుకున్న ప్రతి తల్లీ మాటలతో చేయని ప్రతిజ్ఞ పసిగుడ్డును పెంచిపోషించి రేపటిపౌరునిగా తీర్చిదిద్దడం.

తన కడుపు చించుకుని ఈ ప్రపంచంలోకి వచ్చిన పసిగుడ్డుకు తల్లి మౌనంగా చేసే వాగ్దానం – 'నేను ఈ బిడ్డకు తల్లిగా ఈ కష్టాన్ని ఈ చాకిరీని సంతోషంగా భుజాన వేసుకుంటున్నాను. దీన్ని నెరవేర్చడంలో ఎన్ని కష్టనష్టాలనైనా భరించితీరుతాను'. ఇందుకోసవేం... ఈ తల్లులకోసమే మనం అమ్మల పండుగ జరుపుకోవాలి. బిడ్డ అదృష్టం ఇదే. పొరాడినా... అడుగులేసినా... పాతికేళ్ళు దాటినా... బతికున్నంతకాలం బిడ్డ క్షేమం గురించి ఆలోచించే తల్లి వుండటం, నిజంగా ఇదెంత కమనీయం?!

ప్రపంచం ఏ త్యాగాన్నయితే గుర్తించి మాతృదేవత అన్న పదంతో ఆడవాళ్ళకు గౌరవ వందనం చేసిందో ఆ గౌరవం ఎంత బరువైందో మోసేవాళ్ళకే తెలుస్తుంది. అమ్మ గురించి సాహిత్యంలో పలకని రూపంలేదు. కథలు, కవిత్వం, నాటకం... చివరికి సినిమా... ఇవాళ్టికీ అమ్మకంటే విలువైన వ్యాపారవస్తువు కూడా ఇంకేదీలేదు. అమ్మపేరు చెప్పి దేనికైనా ఓ పూజ్యతను తీసుకునిరావచ్చు.

మే తొమ్మిదో తారీఖును అమ్మల పండుగగా జరుపుకుంటారు.. అమ్మగా మాత్రమే నిలిచిపోయిన అమ్మల కథ చెప్పుకోవడం కూడా అవసరమే అనుకుంటాను. స్త్రీపురుష బేధం లేకుండా అందరూ సమానంగా వుండాలని ఈ ప్రపంచంలో పుట్టిన ప్రతిజీవీ కలలు కంటుంది. సమానత్వంకోసం నిజంగానే ఒక యుద్ధం జరుగుతోంది. ఉన్నట్లుండి యుద్ధంచేసే ఇద్దరిలో ఓ మనిషి కత్తి పారేసి కడుపుపైన చేయి వేసుకోవలసివచ్చింది. ఏమయిందా యుద్ధం? మనిషిలో ఒక బలహీనత అవతలివాళ్ళకి ఓ ఆయుధమే ఔతుంది.

ఈ యుద్ధభూమిపైన సమానత్వంకోసం పోరాడుతున్న స్త్రీ ఒడిలోకి ఓ పాపాయి వచ్చింది. ఆ పాపాయి అమ్మను చూసి జాలిజాలిగా నవ్వింది. పాప నడవలేదు, మాట్లాడలేదు, తన పని తాను చేసుకోలేదు. కనీసం ఈ ప్రపంచం తాలూకు ఎలాంటి జ్ఞానమూలేదు. అలాంటి నిస్సహాయస్థితిలో వున్న పసికూనను వదిలేసి ఎవరైనా ఎలాంటి యుద్ధమైనా చేయగలరా? ప్రాణావసరమైన హక్కులకోసమైనా సరే ఒక నిమిషాన్ని ఖర్చుపెట్టగలరా? ఈ ప్రపంచం పుట్టుకనుంచి జరిగిన వాస్తవం ఇదే. కడుపున పుట్టినబిడ్డ తల్లిని అన్నివిధాలా నిస్సహాయురాల్ని చేసింది, ఒంటరిదాన్ని చేసింది. ఒక వ్యక్తికి ఇంకో మనిషి జీవితం మోయడం ఎంత భారం? పాపాయి పసికూనే. కానీ దానికీ పెద్దవాళ్ళలాగ అన్ని అవసరాలూ వుంటాయి. ఆ అవసరాలన్నీ తీర్చడం తల్లి బాధ్యతై కూర్చుంటుంది. ఈ బరువుబాధ్యతల్ని దించేసి కిందపెట్టడం ఏ తల్లికీ సాధ్యంకాలేదు, కాదు కూడాను.

యుగాలు, తరాలు ఇలాగే గడిచిపోతున్నాయి. అమ్మ అనే పదం, అమ్మతనం పదిలంగానే వుంది. గడప దాటని తల్లయినా, కార్పొరేట్ మదర్

నిజంగా నాకు ఛాలెంజే...

అమ్మ సాంప్రదాయ కుటుంబంలో పుట్టిన గృహిణి. అటు ట్రెడిషనల్గా వుంటూనే ఇటు ఎంతో ఆధునికంగా వుంటుందావిడ. స్థిరమైన వ్యక్తిత్వం ఆవిడది. నాది ఇంటర్క్యాస్ట్ మ్యారేజ్. నాన్నగారు తీవ్రంగా వ్యతిరేకిస్తే ఆవిడే ఒప్పించింది. అమ్మ నాకు ఎంతో మోరల్ సపోర్ట్నిస్తుంది. తెలిసీతెలియకా కూడా అమ్మ ప్రభావం నామీద చాలా వుంది. మా ఇద్దరి బంధం విడదీయరానిది. ఒక్కమాటలో చెప్పాలంటే ఆవిడకు ప్రతిరూపాన్ని నేను.

ఇక నేను అమ్మనవ్వడం అనేది గొప్ప సంతృప్తినిచ్చిన విషయం. నిజంగా దీనిగురించి చెప్పడానికి అసలు మాటలు సరిపోవు. దూరంగా గుంపులోంచి నా చిట్టి కూనలు అఖిల్, ఆమని – ఆడుతూ, నవ్వుతూ సంబరంగా కనిపించినపుడు నాక్కలిగే సంతోషాన్ని నిర్వచించడం అసాధ్యం. సంతోషం, గర్వం, బాధ్యత అన్నీ కలుగుతాయి. వాళ్ళతోటిదే ప్రపంచమనిపిస్తుంది. పిల్లలు పుట్టకముందురోజుల్ని గుర్తుచేసుకుంటే అసలు అప్పుడెలా వున్నామా వాళ్ళు లేకుండా అన్పిస్తుంది. వాళ్ళ వాగుడు, నవ్వులు, ఏడ్పులు, పోట్లాటలు ఇవే మా జీవితానికి నిండుతనాన్ని తెచ్చేది. నా చిన్నారులు ఏంచేస్తున్నా అది నా అంతరాత్మ చేస్తున్నట్లుగా వుంటుంది. వాళ్ళూ నాలాగే ప్రపంచాన్ని అర్థంచేసుకుంటారు. పిల్లలు పెద్దల్ని అనుకరిస్తారు కనుక ఆ విషయంలో నా బాధ్యతేంటో నాకు తెలుసు. వాళ్ళని బాగా పెంచడం నిజంగా నాకు ఛాలెంజే.

పిల్లల్ని స్వేచ్ఛగా వదిలేయాలని ఎంతో చదివినా సరే తల్లి పాత్రలో వాళ్ళని జాగ్రత్తగా కనిపెట్టివుండాలనుకుంటాను. అలాంటప్పుడు నా చిన్నతనంలో అమ్మతో ఎన్నోసార్లు "నువ్వు అనవసరంగా అతిగా భయపడ్తుంటావు" అన్న మాటలు గుర్తొస్తుంటాయి. అప్పుడావిడ నవ్వేసి "నువ్వు పిల్లల్ని కన్నాక అర్థమౌతుందిలే" అనేది. అదిప్పుడు అనుభవంలోకి వచ్చింది. ఎవరో నన్నడిగారు "నీ పిల్లలు ఏం కావాలనుకుంటున్నావ"ని. అప్పుడు "వాళ్ళు సంతోషంగా వుండాలని కోరుకుంటున్నా"నని చెప్పాను. నాకు అన్పిస్తుంది నేను చాలా యాంబిషస్ మదర్నని. ఏ తల్లయినా తాను సంతోషకరమైన వాతావరణంలో వుంటే తన పిల్లల్ని కూడా చక్కగా పెంచగలదు.

– డాక్టర్ కవిత గూడపాటి, సైకాలజిస్ట్

అమ్మతరం నుంచి మరోతరానికి

మా అమ్మ మంగమణి నాకు స్నేహితురాలు. సాహిత్యం - తల్లి పిల్లల అనుబంధంతోపాటు ప్రాపంచిక అవగాహనకు, మేథోవికాసానికీ దోహదపడే నిరంతర చైతన్య స్రవంతి. అమ్మ రచయిత్రి కావడంతో నాలో సాహిత్యాభిలాష చిన్నతనంలోనే మొదలైంది. నేను ఎదగడానికి, మనుషుల్ని అర్థంచేసుకుంటూ బతకడానికి ఎన్నిటికో మూలకారణం అమ్మ. అలాంటి అమ్మ నాకున్నందుకు చాలా సంతోషంగా అన్పిస్తుంది.

అమ్మా నేనూ స్నేహితులు కావడంతో అదే వారసత్వం నా పిల్లలకీ నేర్పాను. వాళ్ళిద్దరూ నాకు మిత్రులే. ఏ ఇన్హిబిషన్సూ లేకుండా చాలా స్వేచ్ఛగా నాతో మాట్లాడతారు. ప్రజాస్వామిక వాతావరణాన్ని పిల్లలకి ఇవ్వగలిగాను. చదువుకోని తల్లుల ప్రేమనురాగాలు తక్కువని కాదు గానీ సాహిత్యంతో పరిచయమున్న జ్ఞానవంతురాలు తల్లయినప్పుడు పిల్లల మనోవికాసం మరింత సంస్కారవంతంగా మారడానికి ఆస్కారముంది. జ్ఞానజ్యోతి మా అమ్మ. బతుకు ఈత నేర్పింది. మా పిల్లల కళ్ళల్లోని వెలుగులు కూడా నాకు తృప్తి కలిగిస్తున్నాయి. అమ్మంటే అపురూపమైన, అద్భుతమైన అన్ని త్యాగలక్షణాలున్న ఒక శిలామూర్తి కాదు. మాతృత్వకిరీటాన్ని మోస్తున్న చిత్రమూ కాదు. అమ్మంటే ఒక సజీవనిర్మాణం. రక్తమాంసాలున్న ప్రాణి. మంచిచెడుల విశ్లేషణలో నిగ్గుదేలిన రూపం. అలాంటి అమ్మకు కూతుర్నయినందుకు గర్వంగా కూడా వుంటుందప్పుడప్పుడూ. మంచి మనుషులుగా మా పిల్లలు తయారవడానికి కారణం అమ్మే. అమ్మకు ఛాయను నేను. నా ఛాయలో రేపటితరపు వెలుగులు మా పిల్లలు.

- శిలాలోలిత, కవయిత్రి, లెక్చరర్

అయినా బిడ్డ ఒడిలోకి వచ్చాక ఆ బాధ్యత వచ్చినట్లు తీసుకోవలసిందే. ఈ బరువైన బాధ్యతకున్న అందమైన పేరే అమ్మ. అమ్మాయి జీవితంలో ఓ తమాషా చూడండి. పదహారేళ్ళు రావడం, స్త్రీత్వం సంతరించుకోవడం, పెళ్ళి చేసుకోవడం... ఇదంతా పెద్ద తేడా లేకుండానే జరిగిపోతుంది. ఈ పెరగటం, పెళ్ళాడటం విషయంలో స్త్రీపురుషులెవరైనా ఒకలాగే వుంటారు. కానీ, తల్లి అవటంతోటే జీవితం తలకిందులైపోవటం ఒక్క తల్లికే కనబడుతుంది. ఇదొక వాస్తవదృశ్యం.

ఏడ్చినా, భయపడ్డా, ఏంచేసినా వాస్తవం మాత్రం ఒడిలో పాపాయే. అమ్మయిపోయిన అమ్మాయి కళ్ళు విప్పార్చి భయంభయంగా ఒడిలో వున్న శిశువువైపు చూస్తుంది. పసిబిడ్డ చిరునవ్వు నవ్వుతుంది. చల్లగా అమ్మ వేలు ముట్టుకుని 'నన్ను పెంచవా' అని అడుగుతుంది ఆ పాపాయి. 'నిన్ను పెంచలేను' అంటుందా ఏ తల్లయినా? అనగలదా? అంత కరకుదనం స్త్రీ హృదయంలో వుండే అవకాశం వుందా? నిస్సహాయంగా వున్న శిశువును ఎత్తుకుని తన కళ్ళముందు వుంచుకున్న ఆ తల్లి 'ఏడవకు... నీకు నేనున్నా. నువ్వు అడక్కపోయినా నిన్ను కన్నాను... నీ సమస్తమైన అవసరాలు, నీ పూర్తి బాధ్యత.. అంతా నాదే' అని మాటలకందని ప్రతిజ్ఞను చేయకుండా వుండగలదా? అంతే జరిగింది. ఈ అమ్మదనం చుట్టూ ఇంత అందమైన భావజాలం వుంటుంది. బిడ్డను భుజాన వేసుకుని నిశీధివేళ నిద్ర నిండిన కళ్ళతో, ఇతరులకు ఇబ్బంది కలగకుండా వనిదాన్ని నిద్రపుచ్చాలి. ఆకలి తీర్చాలి, అవసరాలు తీర్చాలి.

పాపాయి భారాన్ని భుజాన వేసుకునే తల్లికి తనపైన సినిమా పాటలు రాసినా, కవిత్వం రాసి కన్నీళ్ళతో మునిగిపోయినా, ఆవిడ చుట్టూ ప్రేమవరదలు పొంగించినా, పెద్దగా లాభమేమీ వుండదనుకుంటా. ఏ తల్లయినా ఏమనుకుంటుంది? తనపై మెహర్బానీల వర్షం కురిపించి నందువల్ల ప్రయోజనం ఏమిటను కుంటుంది. 'చుట్టూచేరి భజన చేయడం మానేసి, ఈ చిన్నారిని ఓ అరగంట చూసుకోండి.. నేను నిద్ర పోతాను' అంటుందేమో! అమ్మ గొంతులోంచి బయటకు రాని ఈ ఆర్తనాదాన్ని కనీసం అమ్మల పండుగనాడైనా యావన్మందీ వినిపించుకోండి. అమ్మ చాలా మంచిది. పాపాయిని అమ్మకంటే గొప్పగా ఇంకెవరూ గొప్పగా చూపుకోలేరు. కానీ అమ్మకు కాసేపు విశ్రాంతి కావాలి.

ఓ అరగంట తీరిక కావాలి. అమ్మకు జేజేలు చెబుతున్న ఎవరైనా ఈ ఒక్కముక్కా అనండి చాలు. అమ్మకు పట్టుచీర పెట్టేసి రుణం తీర్చుకున్నంత శాలువా కప్పేసి ఆవిడ కళ్ళలో ఆనందబాష్పాలు చూసినంత ఫలం. పాపాయి బాధ్యత అమ్మతోబాటు నాన్న, ఇంకా ఇతర కుటుంబసభ్యులంతా పంచుకుంటే చాలు వంద అమ్మల పండుగలు జరుపుకున్నంత ఫలం.

✷

ఆరోగ్యం

వేదగిరి రాంబాబు

అవయవాలను ఎలా తీస్తారు?

బ్రతికుండగా నలుగురికీ సాయపడమని ఓ సామెతుంది. కానీ చనిపోయి కూడా పదిమందికీ సాయం చేయడమే కాదు, ప్రాణాన్ని పోయగలం. అవయవదానం ద్వారా ఇతరుల ప్రాణాల్ని నిలబెట్టేవాళ్ళూ వున్నారని మీకు తెలుసా?!

అలాంటి మహనీయుల కథలు చెప్పుకుందాం. ఇలాంటివారెందరో వున్నప్పటికీ వీళ్ళ సంఖ్య ఇంకా విశేషంగా పెరగాల్సిన అవసరం వుంది. ముందుముందు అలా జరుగుతుందని ఆశిద్దాం.

దాత మరణించిన తర్వాతే అవయవదానం జరుగుతుంది. కనుక దాత ఆశయం గురించి దగ్గరి బంధువులందరికీ తెలియాలి. అప్పుడే వాళ్ళు దాత కోరికను ఆచరణలో పెట్టగలరు. ఒక్కోసారి అనుకోని దుర్ఘటన జరిగిపోయినప్పుడు, చనిపోయిన తమ వ్యక్తి అవయవాలను దానం చేయాలనే గొప్ప సంకల్పంతో తమవాళ్ళ అవయవదానానికి అంగీకరించిన ఆత్మబంధువులూ వున్నారు. వీళ్ళందరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ ఈ శీర్షికను కొనసాగిద్దాం.

బ్రతికున్నప్పుడే మనం అవయవదానం చేసినా, దానం జరిగేది 'బ్రెయిన్‌డెత్' జరిగిన తర్వాతే. బ్రతికున్నవాళ్ళకి ఈ అవయవదానంవల్ల ఏదైనా అపకారం జరుగుతుందని భయపడనవసరంలేదు.

కొన్ని దశాబ్దాలుగా కంటిలోని కార్నియాదానం, రక్తదానాల గురించి ప్రచారం జరగడంతో ఈ రెండు దానాలూ కొంతవరకూ జరుగుతున్నాయి.

ఆ తర్వాత మూత్రపిండాలదానం విషయంలో కొందరు స్వార్థపరుల ప్రవర్తనతో ఒకవిధంగా చెప్పాలంటే అవయవదానమంటేనే ప్రజల్లో కొద్దిగా వ్యతిరేకభావం వచ్చింది. నిజానికి అవయవదానాలు చేయాల్సింది మరణానంతరమే. మరణం అంటే పూర్తిగా చనిపోయిన తర్వాత కాదు, బ్రెయిన్‌డెత్ కలిగినప్పుడు.

బ్రెయిన్‌డెత్ అంటే మెదడు మాత్రమే చనిపోవడమన్నమాట. ప్రమాదవశాత్తూ మెదడులో రక్తనాళాలు చిట్లినప్పుడు బ్రెయిన్‌డెత్ సంభవిస్తుంది. బ్రెయిన్ మరణించడంతో క్రమంగా మిగతా అవయవాలు, తమ పనితీరును ఆపేస్తాయి. బ్రెయిన్‌డెత్ అని నిర్ధారించుకున్నాక ఆ వ్యక్తిని వెంటిలేటర్స్‌మీద పెట్టి కృత్రిమశ్వాస కల్పించి అవయవాల్ని తీయాలి. వాటిని వెంటనే మరో దేహంలో పెట్టి పనిచేసేలా శస్త్రచికిత్స చేయాలి. చికిత్స ఆలశ్యమైనకొద్దీ అవయవాల సామర్థ్యం తగ్గుతుంది.

బ్రెయిన్‌డెత్ అయినవాళ్ళ కనుగుడ్లలో తిరిగి మామూలు కదలిక లేదంటే నరాల డామేజ్ జరిగిందన్నమాట. కళ్ళముందు చేతుల్ని కదిల్చినా కనుగుడ్ల కదలికలో మార్పు ఏమాత్రం కలగదు. ఎలాంటి కాంతి కంట్లో పడ్డా ఏ కదలికలూ వుండవు. శ్వాసనాళంలోకి సన్నని కాథటూర్లను పంపినప్పటికీ దగ్గులాంటి డిఫెన్స్‌చర్యలు కలగవు. కనుక మత్తుపదార్థాలు ఇవ్వడం మానాలి. కండరాలు రిలాక్స్ అయ్యే మందుల్ని కనీసం నాలుగ్గంటలన్నా వాడకూడదు.

నరాలవైద్యులు మూడు దశలుగా ఈ పరీక్షలన్నీ చేసి నిర్ధారిస్తారు. వెంటనే అవయవదానాన్ని ప్రోత్సహించే స్వచ్ఛంద సంస్థలకు తెలియజేయాలి. తీవ్ర మధుమేహం, కాన్సర్స్, ఇన్‌ఫెక్షన్స్ లాంటివి వున్నవాళ్ళ అవయవాలు దానానికి పనికిరావు. వైద్యులెలాగూ పరీక్షచేసి ఈ విషయాలు తెలుసుకున్న తర్వాతే అవయవాలను దానానికి తీసుకుంటారు.

దాతల గాథల్లోకి వెళ్ళేముందు మరో విషయం గురించి మనం ఆలోచిద్దాం. పుట్టిన ప్రతి ఒక్కరూ గిట్టక తప్పదు. చనిపోయినవాళ్ళని కాల్చి బూడిద చేయడమో, మట్టిలో కలపడమో చేస్తారు. అంతకుముందు పనికొచ్చే అవయవాల్ని అవసరమున్నవాళ్ళకి దానంచేసి శరీరంతోపాటు నాశనం కాకుండా బ్రతికుండేట్లు చూసుకోవడం, మరికొందర్ని బ్రతికించడం గొప్ప విషయం కాదూ?!

అమెరికాలాంటి దేశాల్లో దానానికి ఇష్టపడ్డవాళ్ళు డ్రైవింగ్ లైసెన్స్‌మీదే 'డొనార్' అని ప్రకటించుకుంటారు. స్పెయిన్‌లాంటి దేశంలో చనిపోయిన మనిషి శరీరంమీద ప్రభుత్వానికి హక్కుంటుంది. అవసరమైనవాళ్ళకు అవయవాల్ని దానం చేస్తారు. అలా దానం చేయడం ఇష్టలేనివాళ్ళు తమకు అవయవదానం ఇష్టంలేదని ప్రత్యేకంగా ప్రకటించాలి. అందుకే ఆ దేశంలో అవయవదానాలు, మార్పిడి శస్త్రచికిత్సలు చాలా ఎక్కువగా జరుగుతున్నాయి.

రోజుకు ఎందరో మరణిస్తారు. అవయవాలు దొరకక నరకాన్ని అనుభవిస్తూ ఏ క్షణంలో ప్రాణం పోతుందోనని కొట్టుమిట్టాడుతూ వెయిటింగ్‌లిస్ట్‌లో వున్నవాళ్ళు ఎందరో వున్నారు. ఈ శస్త్రచికిత్సలు చేసే ఆసుపత్రులు, నిపుణులు వున్నారు. ఇలాంటి దానంలో కౌన్సిలింగ్ చేస్తూ సహకరించే స్వచ్ఛంద సంస్థ మోహన్ ఫౌండేషన్ వుంది.

ఒక్క విషయం ఆలోచించండి. మనం దానం చేయడమేకాదు భవిష్యత్తులో దానం పుచ్చుకోవలసిరావచ్చు. ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరికీ తెలీదుగా. మనందరం దానానికి ముందుకొచ్చినపుడు అవసరమైన వాళ్ళందరికీ అవయవాలు లభిస్తాయి. ఇలాంటి స్ఫూర్తిని మనకిచ్చే ఒక మానవీయగాథ వచ్చే ఆదివారం చదవండి.

ఈ విషయాలు ఎవర్నీ కన్విన్స్ చేయాలని రాస్తున్నవి కాదు. వాస్తవాలను మీముందు వుంచే ప్రయత్నం. ఆలోచించండి. నిర్ణయం మీదే. కాకపోతే ఇవి చదివాక కాసేపు దీనిగురించి ఆలోచించండి. అదే ఈ శీర్షిక ఉద్దేశం.

✷

కథ

ఎన్నార్

జానకి తమ్ముడు రఘు రావడంతో ఇల్లంతా సందడిగా ఉంది.

మాటలమధ్యలో "దీని బుర్ర బొత్తిగా చెడిపోయింది మావయ్యా. నీకు తెలిసిన సైకియాట్రిస్టెవరైనా ఉంటే చెప్పు, తీసికెళ్లి చూపిద్దాం" అంది గీత చెల్లెల్ని ఉద్దేశించి.

"నాకేం కాలా, అయామ్ పర్‌ఫెక్టలీ ఆల్‌రైట్, అక్కనే డాక్టర్‌కు చూపించాలి మావయ్యా, ఎప్పుడూ కలలు కంటూ ఉంటుంది" అంది సుమ.

"కలలు కనడమేం జబ్బు కాదు. పైగా ఆరోగ్యకరమైన లక్షణం. అనుమానించడమే పెద్ద జబ్బు"

"ఏది జబ్బో కాదో నేను తేల్చుకుంటాను, ముందు విషయమేంటో చెప్పండి" అన్నాడు రఘు.

ఉదయం తనకొచ్చిన కల గురించి, చెల్లెలు చేసిన హడావిడి పూస గుచ్చినట్లు చెప్పుకొచ్చింది గీత.

****

గీతాంజలి తెలుపుమీద ఆకుపచ్చ పూలున్న ప్యూర్‌సిల్క్ చీర కట్టుకుని ఒత్తైన బారెడుజడలో మల్లెపూలు పెట్టుకుంది. మల్లెల సుగంధం చాలదన్నట్లు మేగ్నెట్ పెర్‌ఫ్యూమ్ స్ప్రే చేసుకుంది. ఆటో ఎంత వేగంగా వెళ్తున్నా పాటికిపదిసార్లు గడియారంచూసుకుంటూ 'టైమైపోయింద'ని మొత్తుకుంటూ ఇంకా వేగంగా పోనిమ్మని నసపెడుతోంది.

అతను చూసీచూసీ 'ఊరుకోవమ్మా, తలతింటున్నావు. టైమయ్యే సంగతి ముందు తెలీదా? చివరి క్షణంలో ఆటో ఎక్కి రాకెట్లా పొమ్మంటే కుదుర్తుందా? ఈ హోరు భరించలేక ఏ బస్సుకో పోయి గుద్దానంటే నా కుటుంబం ఏం కావాలి? తమరికింకా పెళ్లయినట్లు లేదు. కనుక ఏడ్చేవాళ్లెవరూ ఉండకపోవచ్చు. నా పెళ్లామసలే పిచ్చిమొద్దు, నేను లేకపోతే ఎలా బతుకుద్ది' అంటూ హిందీలో దులపరించేసరికి తలవాచిపోయింది గీతాంజలికి.

'వామ్మో వీడెక్కడ దొరికాడురా బాబూ, నాకే క్లాసు పీకుతున్నాడు' అనుకుని కిమ్మనకుండా కూర్చుంది కానీ లోపల గాబరాగానే ఉంది. 'కొంపదీసి ఫంక్షన్ మొదలైపోతుందేమో. తనపేరు పిలిచి ఎంతకూ కనిపించకపోయేసరికి రాలేదని డిక్లేర్‌చేసేసి వేరొకరి పేరు పిలుస్తారేమో, ఆలస్యంగా వెళ్లి ఏ ముఖం పెట్టుకుని దయాస్ ఎక్కగలదు. రాష్ట్రపతా మజాకానా? అయినా కాస్త ముందు బయల్దేరకూడదూ, ఇంత జాగుచేయకుండా' అనుకుని తనను తానే తిట్టుకుని సుతిమెత్తగ మొట్టుకుంది.

"ఇప్పటివరకూ తొందరపెట్టి ఇప్పుడు దిగరేంటి? ఇదే రాష్ట్రపతిభవన్" అన్నాడు ఆటోవాలా హిందీలో.

గీతాంజలి కంగారుగా డబ్బులిచ్చేసి, ఆటో దిగి హ్యాండ్‌బ్యాగ్ సర్దుకుంటుంటే అప్పటికే అక్కడ చేరుకున్న ఆమె స్నేహితులు ఎదురొచ్చారు. "ఏమిటింత లేటు? ఆఫీసుకు లేటెళ్లినట్లు అవార్డందుకోవడానికీ ఆలస్యంగా రావడం ఏమైనా బాగుందా? నీకోసం రాష్ట్రపతి కూడా ఎదురుచూడాలా ఏం?" అంది లలిత.

"ఇప్పటి వరకూ ఆటోవాలా హిందీలో వాయించాడు, ఇప్పుడు నువ్వా? అసలే టెన్షన్‌గా ఉంది. మరింత కంగారుపెట్టకు"

"ఎందుకంత నెర్వస్‌గా ఉన్నావు? రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డు తీసుకుంటున్నందుకు కాన్ఫిడెంట్‌గా ఉండాలికానీ"

"చెప్పినంత తేలిక్కాదులే అనూ...బాప్రే నా గుండెచూడు గుళ్లో గంటలా ఠాంగ్‌ఠాంగ్‌మని కొట్టుకుంటోంది. ఫంక్షన్ ఇంకా మొదలవనందుకు థాంక్‌గాడ్" అంటూ కొంచెం రిలాక్సయి ఊపిరిగట్టిగా పీల్చుకుంది.

"ఎంత అదృష్టవంతురాలివే గీతా? నీలాగా నేనూ ఆర్కిటెక్చర్ చదివితే బాగుండేదని ఇప్పుడనిపిస్తోంది. నిజం చెప్పాలంటే నిన్ను చూస్తుంటే మహా జెలసీగా ఉంది" అంది లలిత.

"చాల్లేవే బడాయ్. ఎలక్ట్రానిక్స్ చేసి నెలకి నలభైవేలు సంపాదిస్తున్నావు, నన్ను చూసి నీకు జెలసీ అంటే హాస్యాస్పదంగా ఉంది"

"డబ్బుదేముంది నువ్వూ సంపాదిస్తావు. ఇంత గుర్తింపొచ్చాక అదేం కష్టం"

"మంచి మాటన్నావు లలితా. హార్లిక్సు సీసాలో మనీప్లాంట్ పెంచితే డబ్బు వెతుక్కుంటూ రాదా ఏంటి? కానీ నీలాగా మాకు పేరు, గుర్తింపు ఎలావస్తాయి?" అంది మృదుల.

గీతాంజలి సిగ్గుతో మెలికలుతిరుగుతూ "అబ్బ పొండి..చాల్లే ఆపండి" అంది.

****

గీతాంజలి చెల్లెలు సుమాంజలి అప్పుడే నిద్ర లేచి దుప్పటి మడుస్తూ సోదరిని పరికించి చూసింది. కళ్లు చిట్లించి, మూతి బిగపట్టి ఆ కలవరింతలు విని అర్థవంతంగా తల పంకించింది.

అరిగిపోయిన రికార్డులా గీత "అబ్బ పొండి... చాల్లే ఊరుకోండి" అంటూ మెల్లగా పక్కనున్న దిండును చరుస్తోంది.

దాంతో సుమకు తిక్కరేగింది. క్షణంలో వంటింట్లోకి వెళ్లింది. "అమ్మా, అమ్మా.. ఒక్కసారి నీ గారాలపట్టిని చూద్దువుగాని రా" అని చేయిపట్టి లాక్కురాసాగింది.

"ఏంటే సుమా, ఏమైందే నీకు?" అని జానకి కంగారుగా అడుగుతోంది.

"నాకేం కాలేదు. నీ పెద్ద కూతురికే ఏమో అయింది. వచ్చిచూడు" అంది సుమ తన ముఖాన్ని ఆముదం తాగినట్లు

వికారంగాపెట్టి.

జానకికి అంతా అయోమయంగా ఉంది. గీత కలవరింతల్ని జాగ్రత్తగా విని అవాక్కయింది.

"చూశావా అమ్మా, ఏ బాయ్ ఫ్రెండ్ కల్లోకొచ్చాడో ఏమో" అంది సుమ.

జానకికి ఒళ్లు మండిపోయి గీత కప్పుకున్న దుప్పటిని ఒక్కసారిగా లాగి అవతల పడేసి "లేవ్వే గీతా, నీకసలు బద్దుందా లేదా? లే ముందు" అంది పట్టరాని కోపంతో.

గీత తుళ్ళింతగా లేచి కూర్చుంది.

కళ్లు చిట్లించుకుంటూ గోడ గడియారం వంక చూసి, చేయి అడ్డం పెట్టుకుని ఆవలిస్తూ "ఇంకా ఆరు కూడా కాలేదు అప్పుడే ఏం కొంపలంటుకున్నాయమ్మా?" అంది విసుగ్గా.

"నీకసలు బుద్ధుందా?" అంది తల్లి తనమాట కూతురు వినలేదని అర్థమై దాన్నే రిపీట్ చేస్తూ.

"లేకపోతే మాత్రం నువ్వేమైనా కొనిపెడ్తావా? ఏం కొనిచ్చినా నాన్నేగదా" విసుగ్గా అంది గీత.

"సిగ్గులేదూ?! నేను సీరియస్‌గా అడుగుతుంటే ఆకతాయిగా జవాబు చెప్తావా?"

"ఓర్నాయనో, ఉదయాన్నే నా నిద్ర చెడగొట్టింది చాలక బుద్ధుందా, సిగ్గుందా, గోంగూరుందా, ఆవకాయుందా? అనడుగుతావేంటమ్మా?! నీకేమైందసలు"

"నాకు పిచ్చెక్కింది. నువ్వూ... నువ్వూ... నవ్వసలు.."

"దిక్కుమాలిన టీవీ సీరియళ్లు చూసి ఒకే మాట అరడజనుసార్లు పలకకమ్మా ప్లీజ్"

"నువ్వింకా నా కళ్లలోకి చూసి ఎలా మాట్లాడుతున్నావే? నువ్వు నా కడుపున చెడబుట్టావుకదవే. అయ్యో, అయ్యో.. ముఖం ఎక్కడపెట్టుకుని తిరగనురా భగవంతుడా?"

అంతే గీతాంజలి నిద్రమత్తు క్షణంలో ఎగిరిపోయింది. ఒక్కసారిగా లేచికూర్చుంది.

ఆశ్చర్యంతో కళ్లు తేలేస్తూ తల్లినీ, చెల్లినీ మార్చిమార్చి చూసింది.

చెల్లెలు సంకేతమాత్రపు సైగకూడా చేయకపోగా సోదరికేసి నీచ, నికృష్ట, హీన, పరమహీన, ఛండాలపు వస్తువుకేసి చూసినట్లు చూసింది.

తల్లిచూపు కూడా చెల్లెలి చూపుకు తూకం వేసినట్లు సరిగ్గా అలాగే ఉంది.

"అసలేమైందమ్మా? నేనేం చేశానని ఇంత కోపంగా ఉన్నావు?" గీత ఆదుర్దాగా అడిగింది.

"ఛీ" అంది తల్లి.

"హు" అంది సుమ

"ఓర్నాయనో ఉదయాన్నే ఇదేం పరీక్షరా బాబూ!? ఎందుకింత కోపంగా ఉన్నారు? అక్కడికి నేనేదో దేశాన్ని అర్థరూపాయికి అమ్మేసినట్లు.

"హూ" అంటూ ముక్కుపుటాలెగరేసింది సుమ..

"ఏమొచ్చిందే రోగం, ఎందుకలా హూంకరిస్తున్నావు?" అంది గీత ఆవేశంగా.

"ఊరికే ఓవరాక్షన్ చేయకు'

"డబ్బులిచ్చినా చేయలేను. ఎందుకంటే నేనేం ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌లో చేరి ఏక్టింగ్‌లో శిక్షణపొందలేదు"

"మాకేం నవ్వు రాలేదు'

"నేనేం నవ్వమన్లేదే"

"నువ్వేంటో ఇవాళే అర్థమైంది మాకు" అంది జానకి

"ఏమర్థమైందమ్మా?" ఉక్రోషంగా అడిగింది గీత.

"అదీ నా నోటితో చెప్పించాలనా? ఇందాక నువ్వెంత చిల్లరగా, చీప్‌గా కలవరించావో తెలుసా? నువ్వు నా కూతురివైనందుకు సిగ్గేస్తోంది"

గీత పిచ్చిగా, వెర్రిగా చూసి "ఇంతకీ నేనేమని కలవరించాను?" అనడిగింది.

"అబ్బ పోండి, చాల్లే ఊరుకోండి" అని సుమ అనుకరించి చూపి మూతి ముప్పైమూడు వంకర్లు తిప్పింది.

"అలా కలవరించానా? అసలు నాకేం కలొచ్చిందబ్బా?" అని



రెండు క్షణాలు ఆలోచించి గుర్తుచేసుకుని "ఓహ్.. " అంటూ ఒక్క అరుపు అరిచింది గీత.

జానకి, సుమ ఉలిక్కిపడ్డారు.

అదేం పట్టించుకోకుండా "అమ్మా మొత్తానికి భలే కలొచ్చిందమ్మా. అంత మంచి కలను చెదరగొట్టింది చాలక ఇంకా మాట్లాడుతున్నారా? అవునూ తెల్లవారుఝామున వచ్చింది గనుక నిజమవుతుందేమో" అంటూ సిగ్గుపడింది గీత.

"అదొక్కటే తక్కువ. ఇంతకీ ఎవడే వాడు?" చుర్రున చూస్తూ అడిగింది జానకి.

"మరీ వాడు, వీడు అంటూ అంత అమర్యాదగా మాట్లాడకమ్మా. ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా.. దయచేసి కొంచెం రెస్పెక్టివ్వమ్మా"

"హవ్వ..హవ్వ... అబ్దుల్ కలామ్‌తో కలలు కంటున్నావా?"

"నిజంగా వెళ్లి కలవాలంటే బోల్డన్ని రూల్సుంటాయి. కలలు కనడానిక్కూడా పర్మిషన్ తీసుకోవాలా ఏం?'

తల్లి తలపట్టుకునేసరికి గీతకు చిరాకేసింది.

"ఏమైందమ్మా? రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డు తీసుకోబోతున్నట్లు..."

"అవార్డా...?" అంది జానకి.

గీత తనకొచ్చిన కలంతా ఉత్సాహంగా ఏకరువుపెట్టింది.

అంతా విన్నాక సుమ నాలుక కొరుక్కుంది, తల్లిని దారి మళ్లించినందుకు.

జానకి సుమ చెవులు రెండూ మెలిపెట్టి, చూపుడువేలితో బెదిరించి వంటింట్లోకి వెళ్లిపోయింది.

＊＊＊＊

అంతా విన్న రఘు హాయిగా నవ్వేసి "చెత్త సినిమాలన్నీ చూసి నీ మైండ్ పాడైపోయిందే సుమా" అని చెవి మెలేసి, తిరిగి తనే "గీతా నేనొక్క మాట చెప్పనా? కలలు కనడం మంచిదే, కానీ వాటితోనే కాలక్షేపం చేస్తే నిజంగా తెలివితక్కువతనమౌతుంది. మన ఆశలు, కోరికలే కలలరూపంలో కనిపిస్తాయి. వాటిని సాకారం చేసుకోవాలని ప్రయత్నించేవాళ్లు తెలివైనవాళ్లు" అన్నాడు రఘు.

"నేను మాగ్జిమం ట్రై చేస్తాను మామయ్యా, కానీ... ఆ కల నిజమౌతుందా?" అనడిగింది గీత.

"గోంగూరపచ్చడౌతుంది. ఇదేం సినిమా అనుకున్నావా, కలలు నిజమైపోవడానికి" అంది సుమ.

"నవ్వినా నాపచేనే పండుతుంది సుమా, ఏమనుకుంటున్నావో" అన్నాడు రఘు.

"మావయ్యా నువ్వు కూడా డ్యామేజింగా మాట్లాడుతున్నావు. నేనేం నాపచేనును కాను. గొప్ప సారవంతమైన నేలను"

"స్పిరిట్ అంటే అది. అనుకున్నది సాధించి తీరుతుంది గీత" అన్నాడు రఘు. ✶

మనమూ-మన నమ్మకాలు

మొలకలపల్లి కోటేశ్వరరావు

కరపత్రాల భక్తి

"ఇదిగో స్వామీ... ఈ కరపత్రిక చదువు. మీరూ ఇలాంటి పత్రికలు అచ్చువేయించి పంచారంటే మీరు కోరిన కోరికలు తీరతాయి" ప్రభాకర్ ఒక కరపత్రం ఇచ్చి చెప్పాడు రమేష్‌తో.

తాను చదువుతున్న న్యూస్‌పేపర్ను పక్కనపెట్టి ఆ కరపత్రం చదివాడు రమేష్. ముందుగా ఆశ్చర్యపోయాడు. తర్వాత అతనికి అసహ్యం, జుగుప్స కలిగాయి.

"మీరూ పంచండి. డబ్బులు దొరుకుతాయి స్వామీ! లక్షాధికారి కావచ్చు!" ప్రభాకర్ ఉత్సాహంగా అన్నాడు మళ్లీ.

"సమాజంలో ఇంత అమాయకులూ, మూర్ఖులూ ఉన్నారా? మూర్ఖత్వానికీ ఓ హద్దులేదా అని ఆశ్చర్యంగా ఉంది" అన్నాడు రమేష్.

"అదేమిటి అంత తేలిగ్గా కొట్టిపారేస్తూ మూర్ఖత్వమంటున్నారా? అలా అంటే ప్రమాదాలు సంభవిస్తాయని అందులో ఉంది కదా?" అన్నాడు ప్రభాకర్ ఆందోళనగా.

"ఏం ప్రమాదాలు? మౌఢ్యానికీ, మూఢత్వానికీ, మూర్ఖత్వానికీ పరాకాష్ఠ ఈ కరపత్రం. నువ్వు ఇవాళ పంచుతున్నావు. నేను పాతికేళ్లనుంచి ఇలాంటి పనికిమాలినవి ఎన్నో చూశాను. ఇది అజ్ఞానం, అమాయకత్వం మినహా మరొకటి కాదు"

ఆ పాంప్లెట్‌లో ఇలా ఉంది.

'ఫలానా దేవాలయంలో పూజ చేస్తుండగా ఒక సర్పం వచ్చింది. ఆ నాగసర్పం తర్వాత బ్రాహ్మణరూపంలో వచ్చి తాను భూమిమీద అవతరిస్తాననీ, ఎవరైతే తన పేరుమీద 1116 పత్రికలు ముద్రించి పంచుతారో వారి కోరికలు 24 రోజుల్లో తీరుతాయనీ, ఎవరైతే రేపూమాపూ అంటూ కాలయాపన చేస్తారో వారికి నష్టం కలుగజేస్తానని చెప్పి బ్రాహ్మణరూపంలో ఉన్న సర్పం మాయమయింది.

ఒకతను 1116 కరపత్రాలు ముద్రించగా అతనికి 80 లక్షల లాటరీ, మరొకతను 858 ప్రతులు పంచగా బంగారంతో నిండిన కలశం, ఒక నిరుద్యోగి ఈ ప్రతులను పంచగా అతనికి ఉద్యోగం, మరొకతను 1925 పత్రాలు పంచగా అతనికి లక్షల రూపాయల విలువైన ఆభరణాలు, నాగేశ్వరి వెయ్యి పత్రికలు పంచగా 50 లక్షల లాటరీ పొంది ఆనందించారు. బద్వేలులో ఒకతను ఈ కరపత్రం చదివి పంచాలనుకుంటూనే నెలవరకూ పంచకపోయేసరికి అతనికి వ్యాపారంలో భారీనష్టం....."

ఇలాంటి అవాకులూ చవాకులతో ఆ కరపత్రం నిండి ఉంది.

"ఈ కరపత్రానికి ఏమైనా అర్థముందా? నువ్వెన్ని కరపత్రాలు పంచుతున్నావు?" రమేష్ అడిగాడు.

"నేను రెండువేల పత్రికలు అచ్చువేయించాను. నిరుడు కూడా ఇలాగే రెండువేల పత్రికలు అచ్చువేయించి పంచాను"

"మరి నీకు బంగారు కలశం దొరికిందా? పోనీ లాటరీ ఏమైనా తగిలిందా?"

"నేను లాటరీ టికెట్టు కొనలేదు. కొని ఉంటే బంపర్ బహుమతి వచ్చేది"

"లాటరీ రాకపోయినా బంగారు ఆభరణాలో, వజ్రాలో దొరికి ఉండాలిగా! నువ్విలా పిచ్చి నమ్మకాలతో, చెత్త కరపత్రాలు పంచుతూ బజార్లంట తిరగకుండా కనీసం నీకేదైనా ఉద్యోగమేదైనా దొరికుండల్సింది కదా"

"నేను గట్టిగా ప్రయత్నించలేదు. లేకపోతే ఉద్యోగం వచ్చి ఉండేదేమో"

"ప్రయత్నిస్తే ఎలాగూ వచ్చి ఉండేది. ప్రయత్నించకుండా ఉద్యోగం రావడం, శ్రమ చేయకుండా లాటరీలో లక్షలు గెలుపొందాలనుకోవడం, అందుకేగా ఈ తిప్పలూ, తిక్కపత్రాలూ పంచడం! వీటివలన లక్షలు కాదు- నిజంగా ఒక్కరూపాయి ఆదాయం వచ్చినా చాలామంది పనీపాటా మానుకుని ఈ కాగితాలు అచ్చువేయించి, ఇవే పంచుతూ బతుకుతారు. ఇక ఎవరికీ పనిచేయాల్సిన అవసరం ఉండదు"

"ఫలానా వాడికి లక్షలు వచ్చాయని రాశారు కదా? అది నిజం కాదా?"

"అవన్నీ పచ్చి అబద్ధాలు. ఎవడో ఒక వెర్రివెంగళప్ప తెలివితక్కువతనంతో ఇలా రాసి పంచితే, వాణ్ణి చూసి మరొకడు... దున్నపోతు ఈనిందంటే దూడని కట్టెయ్యడానికి పరిగెత్తినట్లు... కనీస ఆలోచన లేకుండా ఒకరిని చూసి ఒకరు ఇలా అచ్చువేయించి పంచుతున్నారు. నిజానిజాలేంటని ఒక్కరూ ఆలోచించరు. ఇంత అభూతకల్పనలు, పచ్చి అబద్ధాలు, పిచ్చిమాటలూ నమ్ముతున్నారంటే జనం ఎంత అజ్ఞానంలో, అమాయకత్వంలో ఉన్నారా అని బాధగా ఉంది''

"అలా మాట్లాడి హేళనచేస్తే పాపం చుట్టుకుంటుంది రమేష్... చాలా నష్టపోతావు జాగ్రత్త''

"ఏమీ జరగదు. ఈ అబద్ధాల్ని మోసాన్ని ఎవరైనా ఖండిస్తే వాళ్లకు అది జరుగుతుందనీ, ఇది జరుగుతుందనీ బెదిరించడం! నేను పాతికేళ్లనుంచీ ఇలాంటి వ్యర్థమైన పాంప్లెట్లు చూస్తూనే ఉన్నాను. చూసిన ప్రతిసారీ విమర్శిస్తూనే ఉన్నాను. ఇవి పచ్చిమోసంతో ప్రజలను మూఢనమ్మకాల్లోనూ, భ్రమల్లోనూ అజ్ఞానంలోనూ ఉంచడానికి చేసేవే తప్ప మరేమీ కాదు" అన్నాడు రమేష్.

"అంతే అంటావా?"

"కొద్దిగా ఆలోచించు. ఈ పాంప్లెట్ రాతలకు ఏమైనా హేతుబద్ధత ఉందా? సాధ్యాసాధ్యాలను బేరీజు వేసుకోనక్కర్లేదా?"

ప్రభాకర్ ఏమీ మాట్లాడలేకపోయాడు.

"మూఢ నమ్మకాలతో నిండిన ఇలాంటి కరపత్రాలను కృష్ణ, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో కొంతమంది భక్తులు విపరీతంగా పంపిణీ చేస్తున్నారు. వాటిని చదివినవారు లేనిపోని భయాలతో తామూ అదేపనికి పూనుకుంటున్నారు. ఇది వేలంవెర్రిగా తయారైంది. వెర్రితనానికి హద్దేముంటుంది?"

రమేష విమర్శలకి సమాధానం చెప్పలేక ప్రభాకర్ మౌనంగా ఇంటిదారి పట్టాడు. ✷

విజ్ఞాన వీచిక

చేదు జ్ఞాపకాలను మరిపించే మందు

ఎస్. వెంకట్రావు



'పోస్ట్ ట్రమాటిక్ స్ట్రెస్ డిజార్డర్'ను అరికట్టే పద్ధతి

నిషికి జ్ఞాపకశక్తి ఎంత అవసరమో మరిచిపోవడం కూడా అంతే అవసరమవుతుంది అనేక విషయాల్లో. నిజానికి మరుపన్నది లేకపోతే మనిషి జీవితం నరకంగా మారుతుంది. జీవితంలో సంభవించిన చేదు ఘటనలనూ, విపత్తులనూ మనసు గనుక క్రమంగా చెరిపేయకపోతే ఆ జ్ఞాపకాలు మనిషిని జీవితాంతం వెంటాడుతూనే ఉంటాయి. అయితే అదృష్టమేమిటంటే మనిషి మెదడులో పాతుకుపోయిన చాలా ఘటనలు క్రమంగా మసకబారిపోతూ ఉంటాయి. ఘటన జ్ఞాపకమున్నప్పటికీ ఆ ఘటన తాలూకూ ఉద్వేగాలు క్రమంగా మాసిపోతూ ఉంటాయి. దాంతో కాలం గడుస్తున్నకొద్దీ మనిషికి తన జీవితంలోని చీకటి ఘటనలు గుర్తుకు వచ్చినప్పటికీ మునుపటిలాగా ఉద్వేగానికి గురికాడు. అయితే ఇదంతా మామూలుగా ఆరోగ్యంగా ఉన్న మనుషుల్లో మాత్రమే.

ఏదైనా పెద్ద దుస్సంఘటనకు గురైన వారికి పైన చెప్పిన పరిస్థితి వర్తించదు. పోస్ట్ ట్రమాటిక్ స్ట్రెస్ డిజార్డర్ (పిటిఎస్‌డి)-అంటే ఒక దుస్సంఘటన అనంతరం మానసిక వైకల్యానికి గురికావడంవల్ల ఇటువంటి వారిలో చేదు జ్ఞాపకాలు జీవితాంతం అలాగే ఉండిపోతాయి. ఇంకో మాటలో చెప్పాలంటే అలా జ్ఞాపకాలు స్థిరంగా ఉండిపోవడమే ఒక మానసిక వైకల్యంగా మారిపోతుంది. ఇవాళ ప్రపంచం ఎదుర్కొంటున్న పెద్ద సమస్యల్లో ఈ 'పోస్ట్ ట్రమాటిక్ స్ట్రెస్ డిజార్డర్ (పిటిఎస్‌డి) ఒకటి. ఒక్క అమెరికాలోనే 19 లక్షలమంది ఈ రకమైన మానసిక వైకల్యంతో బాధపడుతున్నారు. యుద్ధాల్లో పాల్గొని యుద్ధ బీభత్సాన్ని కళ్లారా చూసినవారూ, మతఘర్షణలూ మారణహోమాల్లో చిక్కుకున్నవారూ, అత్యాచారాలకు గురైనవారూ ఎక్కువగా ఇటువంటి వైకల్యంపాలవుతుంటారు.

కెనడాలోని మాంట్రియల్ నగరానికి చెందిన మెక్‌గిల్ విశ్వవిద్యాలయంలో క్లినికల్ సైకాలజిస్ట్ అలైన్ బ్రూనెట్, ఇటువంటి వైకల్యానికి గురైన వారికోసం ఒక మంచి మందు 'కనిపెట్టాడు'. అయితే ఈ మందుకు ఆయన పేటెంట్ తీసుకోడానికి కుదరదు. ఎందుకంటే ఆయన 'కనిపెట్టిన' మందు 25 సంవత్సరాల నుండి మనుషులకు వాడుతున్నదే. అయితే ఇది మెదడుకోసం కాకుండా రక్తపోటు నివారించడానికి వాడుతున్నారు. 'ప్రొప్రనోలోల్' అనే ఈ ఔషధాన్ని వాడితే పోస్ట్ ట్రమాటిక్ స్ట్రెస్ డిజార్డర్‌కు గురైనవారిలో చేదు అనుభవాల ఉద్వేగాలు మాయమై పోతాయట. దాంతో ఇటువంటివారు కూడా మామూలు మనుషుల్లా ప్రవర్తిస్తారు.

ఈ మందు ఎలా పనిచేస్తుందో తెలుసుకోవాలంటే అసలు ఒక పెద్ద దుస్సంఘటన జరిగినప్పుడు మనిషి షాక్‌కు గురైతే అతని మెదడులో ఏం జరుగుతుందో తెలుసుకోవాలి. అనుకోని సంఘటన జరిగినప్పుడు మనిషిలో అసంకల్పిత ప్రతీకారచర్య జరుగుతుంది. అయితే సంఘటన చాలా తీవ్రమైనదైతే ఈ జ్ఞాపకం మనిషిమెదడులో శాశ్వతంగా పాతుకుపోతుంది. దాంతో ఆ ఘటన జ్ఞాపకం వచ్చిన ప్రతిసారీ మనిషి అదే విధమైన ఉద్వేగాలకు లోనై ఒక రకమైన ఉన్మాదానికి గురవుతాడు. ఇరాక్ ప్రజలమీద బాంబులు వేసి అమాయకులను వధిస్తున్న అమెరికా సైనికుల్లో చాలామంది ఇప్పుడు ఇటువంటి మానసిక వైకల్యానికి గురవుతున్నారు.

ఒక పెద్ద దుస్సంఘటన జరిగినప్పుడు మనిషి మెదడులోని 'అమిగ్దాల' అనే భాగం ఒత్తిడి కలిగించే హార్మోన్లను విడుదల చేస్తుంది. ఈ హార్మోన్లు మెదడులో జ్ఞాపకం ఉంచుకునే శక్తిని పెంచుతాయి. దుస్సంఘటనకు సంబంధించిన జ్ఞాపకాలు మొదట 'హిప్పోక్యాంపస్' అనే భాగంలో నిలవ ఉంటాయి. తదుపరి ఒక రసాయనచర్య ఈ జ్ఞాపకాలను సంకేతాలుగా మార్చి మెదడులోని 'సెరెబ్రల్ కార్టెక్స్' అనే ప్రధాన భాగపు నాడీ కణాల్లో నిలవ ఉంచుతుంది. అక్కడ ఈ జ్ఞాపకాలు స్థిరంగా, శాశ్వతంగా ఉండిపోతాయి. బాధితుడు, లేక బాధితురాలు జరిగిన ఘటనను జ్ఞప్తి చేసుకున్నప్పుడల్లా ఈ జ్ఞాపకాలు తిరిగి 'హిప్పోక్యాంపస్'లోకి వెళ్తాయి. దీనివల్ల మరిన్ని ఒత్తిడి హార్మోన్లు (స్ట్రెస్ హార్మోన్స్) విడుదలవుతాయి. దాంతో మనిషి మళ్లీ మళ్లీ ఉద్వేగానికి గురై మానసికంగా వైకల్యం పొందుతాడు.

గతంలో శాస్త్రవేత్తలు, కోర్టెక్స్ నాడీ కణాల్లో జ్ఞాపకాలు శాశ్వతంగా ఉండిపోతాయని అనుకునేవారు. అయితే మెక్‌గిల్ విశ్వవిద్యాలయానికే చెందిన మరో శాస్త్రవేత్త కరీం నాదిర్, ఎలుకలపై 2000కు పైగా చేసిన పరిశోధనల్లో తేలిందేమంటే దుస్సంఘటనకు సంబంధించిన జ్ఞాపకాలు శాశ్వత స్టోరేజి నుండి తాత్కాలిక స్టోరేజికి వస్తాయని. ఈ తాత్కాలిక స్టోరేజి పాయింట్‌లోనే జ్ఞాపకాలను 'ఎడిట్' చేయవచ్చునని ప్రొఫెసర్ బ్రూనెట్ కనుగొన్నాడు. ఈయన ఉపయోగించిన పాత ఔషధం 'ప్రొప్రనోలోల్' మెదడులో హార్మోన్ల విడుదలను ఆపేస్తుంది. ఫలితంగా బాధితునిలో జ్ఞాపకాలు పాత ఉద్వేగాలతో కూడిన జ్ఞాపకాలుగా కాకుండా ఉద్వేగరహితమైన జ్ఞాపకాలుగా మారిపోతాయి. దాంతో అతనికి పాత జ్ఞాపకాలు మనసులోకి వచ్చినప్పటికీ గతంతో లాగా తీవ్రమైన ఉద్వేగాలకు లోనుకాడు. దాంతో మానసిక వైకల్యానికి గురికాడు.

ఈ ఔషధంపై మరిన్ని పరిశోధనలు చేసి ఇది పూర్తిగా ఉపయోగకారి అని తేలితే ఇక మనిషికి 'మరపులేని మనసొక నరకం' అని పాడుకోవలసిన అవసరం ఉండదు కదా!

శైలి

వీధి నాటికలు ఉద్యమ తరంగాలు



అది తిరుపతి. భక్తులు పుణ్యక్షేత్రంగా భావిస్తారు. అక్కడ వీధి రంగస్థలం. దాని పేరు సఫ్దర్‌హష్మి ఓపెన్ థియేటర్ (షాట్-2006) ఇందిరా మైదానం (తుడా మైదానం) మధ్యలో వలయాకారంగా వున్నది. ఆ వలయాకారమే ప్రజానాట్యమండలి కళాకారుల ఎరీనా - రంగభూమి - యుద్ధభూమి. దోపిడీ దుర్మార్గాలపై వీధినాటిక కళాస్త్రాలను ఒకదానివెంట ఒకటి పరంపరగా సంధిస్తూనే వుంటారు. అవి బహుళజాతి సంస్థల గుండెల్లో బాంబులై పేలుతుంటాయి.

పాలకుల దొంగాటలను, దొంగనాటకాలను బట్టబయలు చేస్తుంటాయి. తట్టుకోలేనివాళ్ళు ఎలాగూ ముందే చెక్కేస్తుంటారు. కానీ శ్రమజీవులకు, సామాన్యులకు అదో పెద్ద పండుగ. తమ జీవితాలకు ఆకాంక్షలకు, ఆశలకు, ఉద్యమాలకు, పోరాటాలకు అవి అద్దంపట్టుంటాయి. వారిలో అడుగడుగునా ఉత్సాహాన్ని కలిగిస్తుంటాయి. కళాకారులు కూడా వారిలో భాగం గనుక ప్రజావ్యతిరేక విధానాలపై కసిగా నాటకాలు ఆడుతుంటారు. ఏప్రిల్ 27-29 తేదీల్లో మూడురోజులపాటు మలిసంధ్యనుండి అర్ధరాత్రివరకు వేలాదిమంది ప్రేక్షకులమధ్య సాగిన రసవత్తర కార్యక్రమం ఇది.

పెద్ద పెద్ద తెరలుండవు. నాటకాలకు కావాల్సిన హంగులు, ఆర్భాటాలు పెద్దగా కన్పించవు. ఆహార్యం అతిగా కనిపించదు. వృత్తికళాకారులు కాదు. అయినా వారి అభినయానికి ప్రేక్షకుల హర్షాతిరేకాలు ప్రతిధ్వనిస్తూనే వుంటాయి. నిష్కల్మషంగా, నిరాడంబరంగా పాడే పాటలకు నిరంతరం చప్పట్లు మోగుతూనే వుంటాయి.

అందుకే మండు వేసవి గ్రీష్మతాపంలో పన్నీటిజల్లు వర్షించినట్లు ఈ నాటికలు తిరుపతి ప్రేక్షకలోకాన్ని ఎంతగానో మురిపించాయి. రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, చైతన్య కళావిలువలతో మైమరిపించాయి.

మొత్తం 19 వీధినాటికలు ప్రదర్శించారు. వీటిలో కొత్తవి ఆరు.

వీధి నాటకాన్ని పోరాటాయుధంగా సఫ్దర్‌హష్మి ప్రవచించాడు, రుజువుచేశాడు. ఏ నాటిక ప్రదర్శిస్తూ హష్మీ హత్య కావించబడ్డాడో అదే వీధినాటిక హల్లాబోల్ ప్రతి ఏటా షాట్ ప్రారంభనాటికగా ప్రదర్శించడం ముదావహం. జీవితానికి, పోరాటానికి, నాటకానికి గల అంతఃసంబంధాన్ని ఈ నాటిక అద్భుతంగా ఆవిష్కరిస్తుంది. అందుకే వీధినాటిక కళాకారులకు హల్లాబోల్ పెద్దబాలశిక్షలాంటి పాఠ్యగ్రంథం.

శ్రీశ్రీ 'తెల్లవాడి గుండెల్లో నిదురించినవాడా, మా నిదురించిన పౌరుషాగ్ని రగిలించినవాడా' అని అల్లూరిసీతారామరాజును వర్ణించాడు. చారిత్రక వాస్తవాలు ఆధారంగా 'మన్యవిప్లవం' పేరుతో ప్రదర్శితమైంది.

మనదేశానికి రైతు వెన్నెముక. రైతు కష్టంగురించి, జీవితంగురించి ఎవరు ఏ ప్రక్రియలో ఎంత చెప్పినా తక్కువే. దేశవ్యాప్తంగా రైతాంగ ఆత్మహత్యల ప్రమాదఘంటికలు మోగుతున్న తరుణంలో అందుకు కారణాలు తెలియచెప్పే నాటిక రైతు.

భిన్న మతాలు, భిన్న జాతులు, భిన్న భాషలుగల మనదేశంలో సహజీవనం, సౌభ్రాతృత్వం అనివార్యం. ఆ లౌకిక పునాదులపైనే మన చరిత్ర నిర్మితమైందనేది కాదనలేని సత్యంగా చూపే నాటిక.

నిచ్చెనమెట్ల సమాజంలో అగ్రవర్ణాలు, వెనుకబడిన తరగతులు, దళితులు, గిరిజనులు ఆక్రింద గిరిజన స్త్రీలు, వారికి పుట్టే ఆడపిల్లలను (లంబాడీ ఆడశిశువులు) అంగట్లో బొమ్మలుగా అమ్ముకునే హేయమైన దుర్గతిని నగ్నంగా



చెప్పే నాటిక 'తంగేడుపూలు'. నీరు ఎక్కడ చూసినా వ్యాపారమైపోయింది. ఒక రూపాయి నీటి ప్యాకెట్‌నుండి కోట్ల రూపాయలతో పెద్దపెద్ద రిజర్వాయర్‌లు (జలాశయాలు) సైతం ప్రైవేటీకరణ చేతుల్లోకిపోతున్న వైనాన్ని వ్యంగ్యాత్మకంగా రూపొందించిన నాటిక 'వాటర్‌వార్'.

దళితవాడలోని దళితబావినీళ్ళపై అగ్రవర్ణాలవారు అన్యాక్రాంతపు హక్కును పొందేందుకు అధికారయంత్రాంగంతో కలిసి పన్నే పన్నాగాలు, కుయుక్తుల ఫలితంగా ఇరువర్గాలమధ్య జరిగే ఘర్షణలో దళితులు బలౌతున్న తీరును తెలిపే నాటిక 'నీళ్ళంటుకున్నాయి'.

ఓ సాధారణ మధ్యతరగతి దంపతుల జీవితంలోకి టి.వి. యాడ్స్, సీరియల్స్ చొచ్చుకునివచ్చి వారి సంసార జీవితంలో రగిలించే చిచ్చు ఇంతింత కాదయా అంటూ కడుపుబ్బ నవ్వించే నాటిక 'ఓ భార్య, భర్త ఇంకో అది'.

ప్రాథమిక అవసరాల్లో విద్య కూడా ఒకటి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక విద్యపై పాలకులు చూపుతున్న నిర్లక్ష్యానికి తార్కాణం 'ఎలిమెంటరీస్కూలు' నాటిక.

భూమికోసం, భుక్తికోసం, పీడితప్రజల విముక్తికోసం సాగిన రైతాంగ సాయుధపోరాటం 'వీరతెలంగాణా' విప్లవపోరాటం. ఆ దశలో జీవితం, కళలు, పోరాటం విడివిడిగాలేవు. ఒకదానితో ఒకటి విడదీయలేనంతగా మిళితమైపోయాయి. అది రేఖామాత్ర దృశ్యకావ్య చిత్రణగా ఆవిష్కృతమైంది.

గిరిజనులు తమ భూములకోసం, హక్కులసాధనకోసం ఉద్యమాలు నడపటంవేరు. కానీ ఆ ఉద్యమంలో భాగంగా వారే ఓ నాటికను రూపొందించుకుని ప్రదర్శించడం వేరు. ఉద్యమమే నాటకమైన వేళ 'గురి'లో చూస్తాం.

స్వార్థపూరితమైన మగబుద్ధి ఎప్పుడు ఏ కాలంలోనైనా పెద్దపులిలా గాండ్రిస్తూనే వుంటుంది. గోమాతవంటి స్త్రీమూర్తులు ఆ దాష్టీకానికి నిత్యం బలౌతూనేవుంటారు. అందరూ స్త్రీలే ప్రదర్శించిన నాటిక 'గోగ్రహణం'.

చేనేత సంక్షోభం పరాకాష్టకు చేరి చేనేత చావులు సంభవిస్తుండగా పులిమీద పుట్రలా వారిపైకి మైక్రోఫైనాన్స్ సంస్థలు దాడిచేస్తున్నాయి. ఆ దాడిని సమిష్టిగా ప్రతిఘటించాల్సిన ఆవశ్యకతను 'చరఖాతడాఖ' నాటిక చూపుతుంది.

అప్పు లేనిదే అభివృద్ధి అసాధ్యం అంటున్నారు పాలకులు. కానీ అప్పు బానిసత్వానికి తెరదీస్తుంది, కొనసాగిస్తుంది అనే చారిత్రక సత్యాన్ని మహా రచయిత ప్రేమ్‌చంద్ డెబ్భయ్యేళ్ళ క్రితమే 'సవాశేరు గోధుమలు' కథలో చెప్పాడు. ఆ కథే ఇప్పుడో నాటికైంది.

చంద్రబాబు ప్రపంచబ్యాంకు విధానాలు 'గోవిందా గోవిందా' బట్టబయలుచేస్తే వై.ఎస్. ప్రజావ్యతిరేకవిధానాలు సీక్వెల్ నాటికలు 'గోవిందా గోవిందా-2' లో చూస్తాం. ఇది ప్రత్యక్ష వ్యంగ్య నాటిక. దాపరికం, తెరచాటూ అంటూ ఏమీ వుండవు. అంతా డైరెక్టే.

నేటికీ గ్రామీణవ్యవస్థలో పాతుకుపోయిన కులవివక్ష దుర్మార్గాన్ని అణచివేతను, వాటిని ప్రతిఘటించేందుకు నిమ్నవర్గాల్లో రగుల్కొంటున్న పోరాటదీక్షను తెలిపే నాటిక 'ఏ కులం నీది?'.

బ్రిటిష్ సామ్రాజ్యవాదంతోపాటు నైజాం నవాబు గుండెల్లో నగారా మోగించి తిరుగుబాటు బావుటా ఎగురవేసిన గోండువీరుడి నాటిక 'కొమరంభీం'. సృష్టి ప్రారంభమైనప్పటినుండి సంపదను సృష్టించే శ్రామికవర్గ దీక్షాదినం 'మేడే' వరకు సాగిన ఇతిహాస క్రమం 'శ్రామికవీరులు' నాటిక.

గదిలో పెట్టి బంధించి చెలగాటమాడితే పిల్లి అయినా పులిగా మారుతుంది. అబలైనా సబలగా మారి ఆత్మరక్షణకై పోరాటం చేస్తుందనే అంశాన్ని వ్యక్తంచేసే నాటిక 'జో అచ్యుతానంద'. ఇలా ప్రతి సమస్యను ఓ అపురూప దృశ్యకావ్యంగా మలచి కళాకారులు ప్రదర్శించిన తీరు ప్రేక్షకులను సమ్మోహనపరచింది. చైతన్యపరిచింది. అటా.. ఇటా.. అని కాకుండా ఎటో పోయేవారిని సైతం వెన్నుచరిచి ఉద్యమప్రస్థానంలో నిలబెడ్తాయి ఈ నాటికలు. అందుకే ఇవి సామాన్యుల్ని నిరంతరం ఉత్సాహపరిచే ఉద్యమతరంగాలని చెప్పుకోవచ్చు. వీటిని 4వేలమంది ప్రజానీకం తిలకించారు. 600మంది కళాకారులు ఈ 17వ రాష్ట్రవీధి నాటకోత్సవాల్లో (షాట్-2006) పాల్గొన్నారు. ప్రముఖ టి.వి. నాటక కళాకారులు, వినోద్‌బాల, ప్రసాదమూర్తి, అధికారులు జయరామిరెడ్డి, అప్పారావు, మేధావులు సోనియాగుప్తా, వెంకటేష్ ఆత్రేయ, ఎం.వి.ఎస్.శర్మ, రాజకీయవేత్తలు కరుణాకర్‌రెడ్డి, కందారపు మురళి - ఇలా అన్ని రంగాల ప్రముఖులూ సామాన్యులతోపాటు ప్రజానాట్యమండలి కళాకారులపై ప్రశంసలజల్లు కురిపించారు. ✷





కవితా వస్తువు, అభివ్యక్తిలపై నిర్దిష్ట పరిశీలన

అస్పష్టంగా ఉండే కొద్దిపాటి కవిత్వం మినహా సాహిత్యప్రక్రియల్లో ఆధునిక వచన కవిత్వం అందరి దృష్టినీ ఆకర్షిస్తుంది. ముఖ్యంగా సాహిత్యరంగంలో ఎక్కువశాతం కవులే మొదట ప్రవేశిస్తారు. ప్రస్తుతకాలంలో అక్షరాస్యతాశాతం పెరగడం, అందుకు తగిన నివృత్తిలో అన్ని వర్గాల ప్రజానీకం సాహిత్యరంగంలో ప్రవేశించడాన్ని గమనించవచ్చును. మిగతా ప్రక్రియలతో పోల్చినపుడు కవిత్వం రాసేవారి శాతం కాస్త ఎక్కువే. దిన, వార, మాస పత్రికల్లోనే కాకుండా ప్రత్యేక సంచికలూ, కవులు వేసుకునే పుస్తకాల ద్వారా కవిత్వం విరివిగానే వస్తోంది. పాతతరం కవులకూ, కొత్తగా రాస్తున్న వాళ్ళకూ కూడా మరింత అవగాహన పెరగడానికి ప్రస్తుత పుస్తకం ఉపయోగపడుతుంది. ఎం.ఫిల్ పరిశోధనా వ్యాసమైన ఈ పుస్తకం 1986-90 మధ్య కాలాన్ని నిర్దేశించుకుని, ఆ కాలంలో వచ్చిన కవిత్వాన్ని వివిధ వస్తువుల రూపేణా వర్గీకరించి, ఆయా కవితా వస్తువుల్ని, వాటి అభివ్యక్తిని చర్చిస్తుంది.

ఆ కాలంలో వచ్చిన కవిత్వ సేకరణలో రచయిత పడిన ఇబ్బందులు ఆసక్తికరంగా ఉన్నాయి. పత్రికల్లో వచ్చిన కవిత్వం కాకుండా 300 కవితా సంపుటాలు ఆ ఆరునెలల కాలంలో వచ్చినవాటిని రచయిత పేర్కొన్నారు. సంపుటాలుగా వెలువడని (పత్రికలలో అచ్చయిన) కవిత్వం ఇంకెంత ఉంటుందో కదాని కొద్దిపాటి ఆశ్చర్యం కలుగుతుంది. అలాగే ఆయా సంపుటాల్లోని కవితలన్నీ రచయిత నిర్దేశించుకున్న కాలానికి సంబంధించినవి కావని రచయిత పేర్కొన్నారు. తను కేవలం తేదీలుండి ఆ కాలానికి సంబంధించిన కవితల్నే పరిశీలనకు స్వీకరించానని వివరించారు. దీనివల్ల రచయితకు కవితలను కాలానుగుణంగా నిర్దిష్టంగా పరిశీలించడానికి అవకాశం ఏర్పడింది.

సమకాలీన స్త్రీ చైతన్య కవిత, సమకాలీన విప్లవ కవిత, సమకాలీన అనిబద్ధ కవితలుగా వర్గీకరించి ఆ కవితల్లోని వస్తువు, అభివ్యక్తి అంశాలను చర్చించారు. రచయిత ప్రధానంగా ఆయా దృక్పథాలను పరిగణనలోకి తీసుకుని ఈ వర్గీకరణ చేశారు. దీనివల్ల ఆయా కవిత్వ ధోరణులను అర్థం చేసుకోవడంలో స్పష్టతకు అవకాశం ఏర్పడింది.

1986-90 మధ్య కాలంలో వచ్చిన, మంచి కవితలుగా పేరొందిన చాలా వాటిని రచయిత పేర్కొని వాటి వస్తువు, అభివ్యక్తులను చర్చించారు. ఆయా కవితల్ని మనసారా మరోసారి ఆస్వాదించే అవకాశం పాఠకులకి కలుగుతుంది. ఇంచుమించు ప్రముఖ స్త్రీవాద కవయిత్రులందరి కవితలూ ఇందులో ఉన్నాయి. కొండేపూడి నిర్మల 'హృదయానికి బహువచనం', విమల 'వంటిల్లు', పాటిబండ్ల రజని 'అబార్షన్ స్టేట్‌మెంట్' లాంటి కవితలపై విశ్లేషించిన తీరు బావుంది. ఇంకా ఓల్గా, జయప్రభ, మందవరపు హైమావతి తదితరుల కవితలపై విశ్లేషణలు చోటుచేసుకున్నాయి. అలాగే సమకాలీన విప్లవ కవిత్వ విభాగంలో శివారెడ్డి, శివసాగర్, వరవరరావు, చాయారాజ్ తదితరుల కవితలలోని వస్తువు, అభివ్యక్తిలపై విశ్లేషణలు ఉన్నాయి. సమకాలీన అనిబద్ధ కవిత్వ విభాగంలో 'మో', సుమనశ్రీ, వేదవతి, పాపినేని శివశంకర్, గాలివానర రెడ్డి, ఒబ్బిని తదితరుల కవితలపై విశ్లేషణలు ఉన్నాయి.

'కవిత్వాన్ని బాధ్యతగా భావించే దృక్పథానికి దూరంగా కవిత్వాన్ని కలగా భావించే ధోరణి నిరంతరంగా కొనసాగుతూనే ఉంటుంది. ఈ కవిత్వం కూడా కొత్తదనాన్ని కోరుకుంటుంది. మార్పుకోసం ప్రయత్నిస్తుంది. అనాదిగా వస్తున్న సహజమైన మానవ అనుభూతుల్ని, అనుభవాల్ని సాధారణీకరిస్తూ వినూత్నరీతిలో వ్యక్తంచేయడం కవిత్వ సామాన్య లక్షణం' అని సమకాలీన అనిబద్ధ కవితను రచయిత వాఖ్యానిస్తారు. అయితే ఈ విభాగంలో పాపినేని శివశంకర్, వసీరా, జయప్రభలాంటి మరికొంతమంది కవితల్ని పేర్కొనడం వైరుధ్యంగా కనిపిస్తుంది. కవిత గుణాన్నిబట్టి రచయిత ఆయా కవితల్ని పేర్కొన్నారని భావించాలన్నా కూడా ఈ విభాగం కొంత అస్పష్టతకు అవకాశం ఇచ్చేలా ఉంది.

ఆయా విభాగాల్లో స్త్రీ అణచివేత, శారీరకస్థితి, వేశ్యాసమస్య, శ్రామికస్త్రీలు, సంభోగం, తిరుగుబాటు, నిర్బంధం, జైలు, స్మృతి, మాట, కవిత్వం, ప్రకృతి, మానసికస్థితి లాంటి కవితా వస్తువుల్ని ప్రధానంగా వేరుచేసి వాటి నేపథ్యాలను వివరించడం బావుంది. సమకాలీన స్త్రీ చైతన్య కవిత్వాన్ని నిర్వచించడానికి చేకూరి రామారావు అభిప్రాయాన్ని, సమకాలీన విప్లవ కవిత్వాన్ని నిర్వచించడంలో కె.కె. రంగనాథాచార్యుల అభిప్రాయాన్ని, అనిబద్ధ కవిత్వాన్ని నిర్వచించడానికి నగ్నముని అభిప్రాయాన్ని రచయిత సందర్భానుసారంగా పరిగణనలోకి తీసుకోవడం సముచితంగా ఉంది.

కవితా వస్తువును, అభివ్యక్తినీ నిర్దిష్టంగా పరిశీలించిన కె.సి.వి.ఎస్.ఎల్. నరసింహారావు పుస్తకం 'సమకాలీన తెలుగు కవిత్వంలో వస్తువు-అభివ్యక్తి' పుస్తకం ఉపయోగకరమైనదనడంలో ఎలాంటి సందేహం లేదు. పుస్తకాన్ని రూపొందించడంలో కూడా చాలా శ్రద్ధ కనపడుతుంది. చదవడానికి అనుకూలంగా ఉండేలా కవితాపంక్తుల్ని అందివ్వడం, ఆయా విభాగాల చివర్లో కవితలపై అభిప్రాయాల వివరణలు ఇవ్వడం పుస్తకానికి సమగ్రతను తెచ్చిపెట్టింది.

- వొరప్రసాద్

(సమకాలీన తెలుగు సాహిత్యంలో
వస్తువు-అభివ్యక్తి, రచయిత: ఎ.సి.వి.ఎస్.ఎల్. నరసింహారావు,
వెల: రూ. 60/- , పేజీలు: 178,
ప్రతులకు: మైత్రి బుక్ హౌజ్, ప్రజాశక్తి బుక్‌హౌజ్)



నదీ రోదన

కె. ప్రభాకర్

వెల : 60/-, పేజీలు : 90

ప్రతులకు :

రవి పబ్లిషింగ్ హౌస్

కె.పి.హెచ్.బి. కాలనీ,

హైదరాబాద్.



వజ్రాయుధం

ఆవంత్స సోమసుందర్

వెల : 30/-,

పేజీలు : 87

ప్రతులకు :

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్,

విశాలాంధ్ర బుక్ హౌస్.



ఆరెంజ్ జ్యూస్



కావలసిన పదార్థాలు

కమలారసం	-	రెండుకప్పులు
పంచదార	-	నాలుగు కప్పులు
సిట్రిక్ యాసిడ్	-	1/2 స్పూన్

తయారు చేసే పద్ధతి

ముందుగా కమలా పండ్లను జ్యూసర్‌తో జ్యూస్ తీసి పక్కన పెట్టుకుని తర్వాత పంచదారను ఓ గిన్నెలోకి తీసుకుని కొద్దిగా నీరుపోసి తీగపాకం పట్టుకుని ఇందాకటి జ్యూస్‌ను ఇందులో వేసి మరి కాసేపు ఉడికించి సిట్రిక్‌యాసిడ్ కలిపి కావాలనుకుంటే మనకు నచ్చిన రంగు కూడా కలుపుకోవచ్చు. బాగా చల్లారనిచ్చి తడిలేని పొడిసీసాలో నిలవ చేసుకోవాలి. ఒక గ్లాసు రసం తాగాలనుకుంటే నాలుగు స్పూన్‌ల రసం వేసుకుని నీళ్ళు కలుపుకుని ఫ్రిజ్‌లో పెట్టుకుని తాగితే బావుంటుంది. ఈ జ్యూస్‌లు ఎండాకాలంలో సేదతీరుస్తాయి.

- జ్యోతి

ఆలూ కారపూస

కావలసిన పదార్థాలు

బంగాళాదుంపలు	-	అరకిలో
బియ్యప్పిండి	-	కిలో
కారం	-	4 టేబుల్‌స్పూన్లు
ఉప్పు	-	తగినంత
నూనె	-	వేయించడానికి

తయారు చేసే పద్ధతి

ముందుగా ఉడికించిన బంగాళా దుంపల పొట్టుతీసి మెత్తగా చిదుముకోవాలి. ఇందులో బియ్యప్పిండి, కారం, ఉప్పు వేసి ముద్దగా కలపాలి. అవసరం అయితే కొద్దిగా నీళ్ళు చల్లుకోవాలి. బాండీలో నూనె బాగా కాగనిచ్చి కారపూస గిద్దల్లో ఈ పిండి ముద్దను పెట్టి వత్తి వాటిని ఎర్రగా వేయించుకోవాలి. ఇవి చాలా రుచిగా ఉంటాయి.

కలం స్నేహం



హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీకూ కూడా వీళ్లలాగా కలం స్నేహం చెయ్యాలని వుందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్టుకార్డు తీసుకుని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్‌ఫొటోను అతికించి పోస్టు చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలూ చెప్పండి. వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్: కలం స్నేహం, **బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.**

పేరు : బందిల ఆషాజ్యోతి
వయసు : 15 సం॥
చదువు : 9వ తరగతి
లక్ష్యం: బ్యాంక్ మేనేజర్ అవడం
హాబీలు: పుస్తకాలు చదవడం, పాటలు పాడడం.
చిరునామా : బి.ఆషాజ్యోతి, డాటరాఫ్ అబ్రహాం, చినకాకాని (పోస్ట్), మంగళగిరి (మం), గుంటూరు జిల్లా. 522 503.

పేరు : బాయన హరీష్
వయసు : 14 సం॥
చదువు : 10వ తరగతి
స్కూలు : రాజా హైస్కూల్
హాబీలు: పుస్తకాలు చదవడం, కార్టూన్లు చూడడం, టెన్నిస్ ఆడడం.
లక్ష్యం: అమ్మానాన్న ఇష్టప్రకారం చదవడం, వాళ్లు చెప్పిన మాట వినడం.
చిరునామా: బి.హరీష్, సన్నాఫ్ శ్రీనివాసరావు, డోర్ నెం:6-3-43, కోండ్రువారి వీధి, విజయవాడ.

పేరు : పి.రామకృష్ణ
వయసు: 13 సంవత్సరాలు
చదువు : 8వ తరగతి
స్కూల్: నవోదయ విద్యానికేతన్
లక్ష్యం: డాక్టర్ అవడం
హాబీలు: చెస్, క్రికెట్ ఆడడం, పుస్తకాలు చదవడం.
చిరునామా : పి.రామకృష్ణ, సన్నాఫ్ నరసింహ, అంబేద్కర్ వీధి, కొల్లాపురం (మం), మహబూబ్‌నగర్ జిల్లా. 509 102.

పేరు : కావూరి పావని
వయసు : 8 సం॥
చదువు : 3వ తరగతి
స్కూలు : ఎం.పి.యు.పి స్కూల్
లక్ష్యం : టీచర్ అవడం
హాబీలు: ఆటలు ఆడడం, ప్రజాశక్తి పేపర్ చదవడం.
చిరునామా : కె.పావని, డాటరాఫ్ వీరభద్రం, హౌస్ నం.18-2-112, ఎ.ఎస్.ఆర్ కాలనీ, భద్రాచలం, ఖమ్మం జిల్లా. 507 112.

పేరు : సి.హెచ్.ఉషాకిరణ్
చదువు : 10వ తరగతి
స్కూలు: ఎస్.ఎన్.జి.హెచ్ స్కూల్
లక్ష్యం: డాక్టర్ అవడం
హాబీలు: చదవడం, బొమ్మలు వేయడం.
చిరునామా : సి.హెచ్.ఉషాకిరణ్, డాటరాఫ్ శింగరకొండ, చేబ్రోలు, గుంటూరు జిల్లా. 522 212.

పేరు : డి.యాకయ్య
వయసు : 15 సం॥
చదువు : 10వ తరగతి
స్కూలు : జిల్లా పరిషత్ సెకండరీ స్కూల్
లక్ష్యం: పోలీస్ ఆఫీసర్ అవడం
హాబీలు: క్రికెట్ ఆడడం, ప్రజాశక్తి చదవడం.
చిరునామా : డి.యాకయ్య, నర్సింహులపేట (పోస్ట్ & మం), వరంగల్ జిల్లా. 506 324.



పేరు : రాజుపాలెం విజయ్‌చంద్రకాంత్
వయసు : 10 సం॥
చదువు : 5వ తరగతి
స్కూలు: సెయింట్ ఇగ్నేషియస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, ఎ.బి.పాలెం
లక్ష్యం: డాక్టర్ అవడం
హాబీలు: బొమ్మలు వేయడం, ప్రజాశక్తి చిన్నారి చదవడం.
చిరునామా : ఆర్.విజయ్‌చంద్రకాంత్, సన్నాఫ్ కోటేశ్వరరావు, శ్రీరామానగర్ కాలనీ, ప్రత్తిపాడు (పోస్ట్ & మం), గుంటూరు జిల్లా. 522 019.